www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -161 ఆదివారం 27 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

### : ఈసీ ప్రెస్ నోట్‌పై కాంగ్రెస్ ఫైర్



**ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణపై జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు**

**యువతను లక్ష్యంగా చేసుకుని జాబితాల నుంచి పేర్లు తొలగిస్తున్నారని ధ్వజం**

**ఢిల్లీ సెప్టెంబర్ 26(ప్రజావినికిడి):** భారత ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనపై విచారణ**మిగతా 2లో...**

# నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే

### ఈసీలో విభేదాల వార్తలను ఖండించిన పూర్తిస్థాయి కమిషన్




**ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..**

**ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ**

**నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని స్పష్టం చేసిన ముగ్గురు కమిషనర్లు**

**ఓటర్ల సవరణపై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి**

**పనితీరును మెరుగుపర్చేందుకు అంతర్గత విధానాల్లో కీలక మార్పులు**

**ఈసీఐనెట్ పోర్టల్‌పై సమీక్షకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు**

**ఢిల్లీ సెప్టెంబర్ 26(ప్రజావినికిడి):** భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలను కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలకు తెరదించుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి శనివారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి **మిగతా 2లో...**

## కబడ్డీలో భారత్ డబుల్ గోల్డ్

### పురుషుల, మహిళల ఫైనల్స్‌లో ఇరాన్‌పై ఘన విజయం

**ఒకే రోజు కబడ్డీలో స్వర్ణాలు సాధించిన మహిళల, పురుషుల జట్లు**

**గత టైటిళ్లను విజయవంతంగా నిలబెట్టుకున్న భారత జట్లు**





**ఢిల్లీ సెప్టెంబర్ 26(ప్రజావినికిడి):** ఆసియా క్రీడల్లో భారత కబడ్డీ జట్లు స్వర్ణ పతకాలతో మెరిశాయి. నేడు జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్స్‌లో పురుషుల, మహిళల జట్లు రెండూ ఇరాన్‌ను ఓడించి తమ టైటిళ్లను విజయవంతంగా నిలబెట్టుకున్నాయి. దీంతో భారత కబడ్డీ ఒకే రోజు రెండు స్వర్ణాలను ఖాతాలో వేసుకుని సంబరాలు చేసుకుంది.పురుషుల ఫైనల్ ఆద్యంతం హోరాహోరీగా సాగింది. **మిగతా 2లో...**

## కాళేశ్వరం పునరుద్ధరణకు రంగం సిద్ధం

**నవంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభం**

**2027 వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యం**

**అక్టోబర్ 5న సీడబ్ల్యూసీకి డిజైన్లు : అధికారులు**

**భద్రత, నాణ్యతలో రాజీ లేదన్న మంత్రి ఉత్తమ్**



**హైదరాబాద్ సెప్టెంబర్ 26 (ప్రజావినికిడి):** కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు నవంబర్ రెండో వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన **మిగతా 2లో...**

## 10 శాతం వృద్ధి సాధ్యమే

**: టెక్నాలజీపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు**

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెట్టుబడులతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు**



## రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

**హైదరాబాద్ సెప్టెంబర్ 26 (ప్రజావినికిడి):** సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు.తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, **మిగతా 2లో...**



## కర్నూలును ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు

**రాష్ట్రంలో ఏవియేషన్, డ్రోన్ రంగాలకు కర్నూలు కీలక కేంద్రం**

**కర్నూలు ఎయిర్‌పోర్టులో ఓరియంట్ ఫ్లయింగ్ అకాడమీ ఎఫ్‌టీఓ ప్రారంభం**

**కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**




**ఓర్వకల్ సెప్టెంబర్ 26 (ప్రజావినికిడి):**ఆంధ్రప్రదేశ్‌ను ఏవియేషన్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. **మిగతా 2లో...**

## మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి

### : ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



**హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ**

**పీవీ, మన్మోహన్ వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని వ్యాఖ్య**

**మౌనాన్ని భాషగా మార్చి గొప్ప పాలన అందించారని ప్రశంస**

**హైదరాబాద్ సెప్టెంబర్ 26 (ప్రజావినికిడి):** మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, విప్రో సర్కిల్ వద్ద మన్మోహన్ **మిగతా 2లో...**



## పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్..

**ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఫార్మాసిటీపై పీసీబీ చర్యలు**

**సోషల్ మీడియా ఫిర్యాదు ఆధారంగా కాలుష్యంపై తనిఖీలు**

**పరవాడలోని 95 ఫార్మా పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ**

**వ్యర్థాల నిర్వహణపై పరిశ్రమలకు కీలక దిద్దుబాటు చర్యల ఆదేశం**

**అమరావతి సెప్టెంబర్ 26 (ప్రజావినికిడి):** సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 95 పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. శుద్ధి చేయని వ్యర్థాలను వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్నారన్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది. **మిగతా 2లో...**

## భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం సమీక్ష

**వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం పంపిణీకి ఆదేశం**

**ప్రకాశం బ్యారేజీకి ఎగువ, దిగువన కొత్త బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలు**

**తాజా వర్షాలతో రాష్ట్రంలోని జలాశయాల్లోకి 21 టీఎంసీల అదనపు నీరు**

**రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గుదల**

**అమరావతి సెప్టెంబర్ 26(ప్రజావినికిడి):** గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం అందించాలని ఆదేశించారు. అదే సమయంలో కృష్ణా నదిపై రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు.**మిగతా 2లో...**



# కబడ్డీలో భారత్ డబుల్ గోల్డ్

మొదటిపేజీ తరువాయి

భారత జట్టు 40-34 తేడాతో ఇరాన్‌పై విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఒక దశలో ఇరు జట్ల స్కోర్లు 20-20తో సమంగా నిలిచాయంటే పోరు ఎంత తీవ్రంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. అయితే, కీలక సమయంలో పుంజుకున్న భారత క్రీడాకారులు ఇరాన్‌పై పైచేయి సాధించి విజయాన్ని అందుకున్నారు. వరుసగా ఏడుసార్లు స్వర్ణాలు గెలిచిన భారత పురుషుల జట్టు, 2018 జకార్తా గేమ్స్‌లో ఇరాన్ చేతిలో ఓడి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అయితే, ఆ తర్వాత పుంజుకుని 2023లో టైటిల్ గెలిచి, ఇప్పుడు దాన్ని నిలబెట్టుకుని మరోసారి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.

అంతకుముందు జరిగిన మహిళల ఫైనల్‌లో కూడా భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఇరాన్‌పై 37-34 తేడాతో గెలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. దీంతో రెండు విభాగాల్లోనూ ఇరాన్‌ను ఓడించి భారత్ డబుల్ గోల్డ్ సాధించినట్టయింది.

# మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి

సింగ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మౌనాన్ని తన భాషగా మార్చుకుని, దేశానికి అద్భుతమైన పాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. అంతటి మహనీయుడికి భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవ తీసుకుని మన్మోహన్ సింగ్‌ను భారతరత్నతో సత్కరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ బాధ్యతలు చేపట్టారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల దార్శనికత వల్లే దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయని, దాని ఫలితంగానే నేడు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటివి రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ చట్టాన్ని తీసుకువచ్చి, భూనిర్వాసితుల అంగీకారాన్ని తప్పనిసరి చేసిన ఘనత మన్మోహన్ సింగ్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.

మన్మోహన్ సింగ్ జీవితం నేటి 'జెన్-జెడ్' సహా అన్ని తరాలకు స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలును ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు







**మొదటిపేజీ తరువాయి** కర్నూలు జిల్లాను ఏవియేషన్, డ్రోన్, పారిశ్రామిక రంగాలకు కీలక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. కర్నూలు విమానాశ్రయంలో హిందుస్థాన్ గ్రూప్‌కు చెందిన ఓరియంట్ ఫ్లయింగ్ అకాడమీ ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీఓ)ను కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తొలి ఎఫ్‌టీఓను కర్నూలులో ఏర్పాటు చేయడం చారిత్రాత్మక పరిణామమన్నారు. కేవలం విమానాశ్రయాల నిర్మాణానికే పరిమితం కాకుండా శిక్షణ, విమానాల నిర్వహణ, గ్రౌండ్ ఆపరేషన్స్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ తదితర అన్ని విభాగాలతో సమగ్ర ఏవియేషన్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దేశంలో 2014లో 74 విమానాశ్రయాలు ఉండగా ప్రస్తుతం సుమారు 166కు చేరాయని మంత్రి వెల్లడించారు. విమానాశ్రయాలు, విమానాలు, ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరం కూడా పెరుగుతోందన్నారు. ఈ అవసరాన్ని తీర్చడంలో ఎఫ్‌టీఓల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కర్నూలు భౌగోళికంగా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సమీపంలో ఉండటంతో ఏవియేషన్ కార్యకలాపాలకు అనుకూల ప్రాంతమని మంత్రి తెలిపారు. ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న విమానాశ్రయంతో పాటు ఏడాది పొడవునా అనుకూల వాతావరణ పరిస్థితులు ఉండటం పైలట్ శిక్షణకు అదనపు ప్రయోజనమన్నారు. ప్రస్తుతం ఎఫ్‌టీఓలో మూడు శిక్షణ విమానాలు ఉన్నాయని, వాటి సంఖ్యను త్వరలో 10కి పెంచి కర్నూలును దేశంలోని ముఖ్యమైన ఏవియేషన్ కేంద్రాల్లో ఒకటిగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ఎఫ్‌టీఓ ద్వారా ఏడాదికి సుమారు 60 మంది విద్యార్థులకు శిక్షణ అందించే సామర్థ్యం ఏర్పడుతుందని తెలిపారు. దీనితో పాటు విమానాల నిర్వహణ, గ్రౌండ్ ఆపరేషన్స్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు

# కాళేశ్వరం పునరుద్ధరణకు రంగం సిద్ధం

**మొదటిపేజీ తరువాయి** సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను అక్టోబర్ 5న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి సమర్పించనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. 2027 వర్షాకాలం నాటికి ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. బ్యారేజీల భద్రత, నాణ్యత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సహా నిపుణుల కమిటీలు లేవనెత్తిన అభ్యంతరాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల మేరకే పనులు చేపడతామని వెల్లడించారు. ఈ మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేసి, వాటి పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన ఈ సమావేశంలో నొక్కిచెప్పారు.

# 10 శాతం వృద్ధి సాధ్యమే

దేశ ఆర్థిక వృద్ధి రేటు 10 శాతం మార్కును అధిగమించాలంటే అన్ని రంగాల్లోనూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతిక విభాగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారానే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని ఆమె స్పష్టం చేశారు. బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సాంకేతికత ఆధారంగా వివిధ రంగాల్లో మరిన్ని అంకుర సంస్థలు ఆవిర్భవించాలని ఆమె పిలుపునిచ్చారు. నూతన సాంకేతికతలను ప్రజలు సులభంగా అందిపుచ్చుకునేలా నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేవలం దిగ్గజ సంస్థలకే పరిమితం కాకుండా, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) సైతం ఏఐ వినియోగం గణనీయంగా పెరగాలని ఆమె ఆకాంక్షించారు. దేశ మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధిలో తదుపరి దశకు చేరుకోవాలంటే అన్ని విభాగాల్లోనూ డిజిటల్ వ్యవస్థలకు పెద్దపీట వేయాలని నిర్మలా సీతారామన్ వివరించారు. ఈ ఆధునిక సాంకేతిక రంగాలకు తగిన ప్రోత్సాహం అందిస్తే, దేశ భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.

# రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' తయారైందని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు.

# నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే

మొదటిపేజీ తరువాయి

ఉన్న గ్రూప్ ఫోటోతో పాటు ఒక సుదీర్ఘమైన ప్రెస్ నోట్‌ను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), ఓటర్ల నమోదు ప్రక్రియ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలపై ఇందులో సమగ్రంగా వివరణ ఇచ్చారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని సెప్టెంబర్ 23న ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించింది.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఆ తర్వాత ఈ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ప్రత్యేక సవరణ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది.

కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో, దరఖాస్తుదారులు తమ తల్లిదండ్రుల పేర్ల ద్వారా గత సవరణతో తమ సంబంధాన్ని ధ్రువీకరించాలనే నిబంధనపై వస్తున్న విమర్శలపైనా కమిషన్ స్పందించింది. ఈ డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది. అయితే, ఈ నిబంధన కేవలం ప్రత్యేక సవరణ ప్రక్రియకు మాత్రమే వర్తిస్తుందని, మిగతా సమయాల్లో ఎలక్టర్ల నమోదు నిబంధనలు, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారాలనే వాడతామని స్పష్టం చేసింది.

గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోవడంపై కూడా ఈసీ వివరణ ఇచ్చింది. ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన ఫారాలను సేకరించాలని గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) సంబంధిత బూత్ లెవల్ అధికారులను ఆదేశించారని పేర్కొంది. ఇప్పటికే ఆ 97 మందిలో 81 మంది తమ పేర్లను చేర్చాలని కోరుతూ ఫారం-6 సమర్పించారని వెల్లడించింది.

ఇక, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌కు యాక్సెస్ విషయంలో ఈసీఐనెట్ (ఈఆర్ఓనెట్) పోర్టల్‌పై తలెత్తిన ఆందోళనలపైనా కమిషన్ స్పందించింది. క్షేత్రస్థాయి అధికారులకు వారి చట్టబద్ధమైన అధికారాలకు అనుగుణంగానే 'రోల్-బేస్డ్ యాక్సెస్' ఇస్తామని స్పష్టం చేసింది. ఈ పోర్టల్ పనితీరును సమీక్షించేందుకు ఓ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో ఐఐటీ లేదా ట్రిపుల్ ఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడు కూడా ఉంటారని ప్రకటించింది. క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ ఈసీ విధానపరమైన అంశాలకు సంబంధించింది కాదని, డిప్యుటేషన్‌పై ఉన్న ఓ అధికారి పని పునఃపంపిణీకి మాత్రమే సంబంధించిందని కమిషన్ స్పష్టం చేసింది.

అంతర్గత పనివిధానాలను మరింత బలోపేతం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ప్రకటించింది. ఇకపై కమిషన్ సమావేశాల అజెండాలను సభ్యులకు ముందుగానే సర్క్యులేట్ చేయాలని, సమావేశం అనంతరం మినిట్స్ జారీ చేయాలని నిర్ణయించింది. కమిషనర్లు అధికారులకు జారీ చేసే ఆదేశాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ప్రత్యేక సవరణ గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది. తమ ప్రధాన నిర్ణయాలన్నీ సమష్టిగా, ఏకగ్రీవంగానే తీసుకున్నామని కమిషన్ పునరుద్ఘాటించింది.

# సీఈసీ రాజీనామా చేయాల్సిందే

మొదటిపేజీ తరువాయి

జరపాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే భారీ కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఈ సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ శనివారం గట్టిగా పట్టుబట్టింది. ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, ఈసీఐ నేడు ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఈ వివరణ కాంగ్రెస్ ఆగ్రహాన్ని మరింత పెంచింది. ఈసీఐ ఇప్పుడు ఆత్మరక్షణలో పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ జైరాం రమేశ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వరుస పోస్టులతో ఈసీఐని, సీఈసీని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు. "మీడియా కథనాల్లో వచ్చిన ఆరోపణలను ఈసీఐ తన ప్రెస్ నోట్‌లో ఎక్కడా నేరుగా ఖండించలేదు. వాటి తీవ్రతను తగ్గించే ప్రయత్నం మాత్రమే చేసింది. గోవా విషయంలో తప్పు చేసి దొరికిపోయాక, తొలగించిన 97 మందిలో 81 మంది పేర్లను తిరిగి చేర్చామని సిగ్గులేకుండా చెబుతోంది. అంటే, మొదట ఓటర్ల హక్కును కాలరాసి, దొరికిపోయాక మళ్లీ వారి పేర్లను చేర్చుతున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసం?" అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఓటరు నమోదు గడువును పొడిగించిన ఈసీఐ.. కర్ణాటక, తెలంగాణ, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అన్యాయంగా ఓటు హక్కు కోల్పోయిన వారి పరిస్థితి ఏంటని నిలదీశారు. కేవలం ఒక వ్యక్తి అవినీతి వల్ల ఓటు హక్కు కోల్పోయిన ఈ రాష్ట్రాల ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఈసీఐకి లేదా అని ఆయన అన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఐఐటీ/ట్రిపుల్ ఐటీ నిపుణులతో ఈసీనెట్ పోర్టల్‌ను సమీక్షిస్తామని చెప్పడం, సమస్య ఉందని అంగీకరించడమేనని జైరాం రమేశ్ పేర్కొన్నారు. సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు, ప్రతిపక్షాలపై ద్వేషం, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం, ముఖ్యంగా యువ ఓటర్లను (జెన్ జీ) లక్ష్యంగా చేసుకోవడం వంటి అంశాలు ఆయన అవినీతిని బయటపెట్టాయని ఆరోపించారు. ఫారం 6లో పార్లమెంటు ఆమోదం లేకుండా మార్పులు చేసి, యువత ఓటు నమోదు చేసుకోకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.

సీఈసీ బ్యూరోక్రసీ ముసుగులో దాక్కోవాలని చూస్తున్నారని, కానీ ఆయన బండారం బట్టబయలైందని జైరాం రమేశ్ అన్నారు. దేశమంతా ఆయనను జవాబుదారీ చేయాలని చూస్తోందని, ఈ నేపథ్యంలో సీఈసీ రాజీనామా లేదా ఆయనపై విచారణ జరపడం మినహా మరో మార్గం లేదని స్పష్టం చేశారు.

# పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్..

మొదటిపేజీ తరువాయి

వివరాల్లోకి వెళితే, పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లలో నల్లటి రంగులో, దుర్వాసనతో కూడిన నీరు ప్రవహిస్తున్నట్లు శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ అయింది. ఈ వీడియో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో, వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన పీసీబీ అధికారులను ఆదేశించారు.

డిప్యూటీ సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పీసీబీ అధికారులు, వీడియోలో కనిపించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నమూనాలను సేకరించి పరిశీలించగా, శుద్ధి చేయని వ్యర్థ జలాలు వర్షపు నీటి కాలువల్లోకి చేరుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనికి బాధ్యులుగా ఫార్మాసిటీలోని మొత్తం 95 కంపెనీలకు



షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

కేవలం నోటీసులు ఇవ్వడమే కాకుండా, కాలుష్య నివారణకు పలు కఠినమైన దిద్దుబాటు చర్యలను కూడా పీసీబీ తప్పనిసరి చేసింది. పరిశ్రమల ప్రాంగణంలోనే వర్షపు నీటిని నిల్వ చేయాలని, కలుషిత నీటిని బయటకు వదలరాదని స్పష్టం చేసింది. వ్యర్థాల నిర్వహణను డిజిటలైజ్ చేయాలని, తేదీ, సమయంతో సహా రికార్డ్ చేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఫుటేజీని ఆరు నెలల పాటు భద్రపరచాలని సూచించింది. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థతో కూడిన స్క్రబ్బర్లను వాడాలని, పర్యావరణ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశాల్లో పేర్కొంది. నిర్ణీత సమయంలో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని, అక్రమంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నట్లు తేలిన పరిశ్రమలపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబీ హెచ్చరించింది. తీసుకున్న చర్యలపై ఒక సమగ్ర నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు.

# భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం సమీక్ష

మొదటిపేజీ తరువాయి

శనివారం జరిగిన ఈ సమీక్షలో అధికారులు రాష్ట్రంలోని తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్రలో నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయని, పలుచోట్ల నివాస ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. సహాయక చర్యలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఐదు రోజులుగా సముద్రంలోకి వెళ్లలేని మత్స్యకారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి అండగా నిలవాలని, తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

**కృష్ణాపై కొత్త బ్యారేజీలు.. నీటి భద్రతపై దృష్టి**

ఈ సందర్భంగా స్థానికంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పెరుగుతోందని అధికారులు తెలపగా, ఆ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే మార్గాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య ఒకటి, ప్రకాశం బ్యారేజీకి దిగువన మరొకటి చొప్పున రెండు కొత్త బ్యారేజీల నిర్మాణం అవసరమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు.

అలాగే, హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించి, వంశధార నీటిని రిజర్వాయర్‌లోకి తరలించే పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు.

**నిండిన జలాశయాలు.. తగ్గిన వర్షపాతం లోటు**

తాజా వర్షాల వల్ల రాష్ట్రంలోని 29 ప్రధాన రిజర్వాయర్లలోకి భారీగా నీరు వచ్చి చేరినట్లు ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. సెప్టెంబర్ 23 నాటికి 101 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ, కేవలం మూడు రోజుల్లో 21 టీఎంసీలు పెరిగి 122 టీఎంసీలకు చేరిందని తెలిపారు. ఒక్క ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల్లోనే సుమారు 5 టీఎంసీల నీరు అదనంగా చేరిందని వివరించారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు.

గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రవాహం 1.20 లక్షల క్యూసెక్కుల నుంచి 3.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. వంశధారపై గొట్టా బ్యారేజీకి, నాగావళిపై నారాయణపురం ఆనకట్టకు కూడా ఇన్‌ఫ్లో రికార్డు స్థాయిలో పెరిగింది. పెరిగిన ప్రవాహాలను సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లతో పాటు చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని సీఎం ఆదేశించారు. వరద తగ్గుముఖం పట్టినా, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది: సీఎం చంద్రబాబు



భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నరు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు.

స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

**సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు**

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
ఆదివారం 27 సెప్టెంబర్ 2026

# సమాజ నిర్మాణానికి, విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడంలో టీచర్స్ కృషి..

**రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎం ఐ గుల్షాని,కార్యదర్శి మల్లెల శ్రీనివాస్ రెడ్డి**

**ఉపాధ్యాయ సేవలకు ఘన సత్కారం**

**టీఆర్ఎస్ఎంఏ రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2026 వైభవంగా**




**సారూర్‌నగర్,/ సెప్టెంబర్ 26 రంగారెడ్డి,(ప్రజావినికిడి):** :సమాజ నిర్మాణానికి, విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడంలో టీచర్స్ కృషి కీలకమని తెలంగాణ రికగ్నైస్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎం ఐ గుల్షాని,కార్యదర్శి మల్లెల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్‌లోని కొత్తకాపు యాదవ్‌రెడ్డి గార్డెన్స్‌లో తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం (టీఆర్ఎస్ఎంఏ) రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో "ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు–2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలకు గుర్తింపుగా పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను పురస్కారాలతో సత్కరించారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎం ఐ గుల్షాని. మాట్లాడుతూ, జిల్లాలోని 200 స్కూల్స్ బెస్ట్ టీచర్స్ అవార్డ్స్ పోటీ నిర్వహించి 400 ల మంది బెస్ట్ టీచర్స్ కు అవార్డుల ప్రదానం చేశారు. ప్రైవేట్ పాఠశాలలు, ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించడంలో, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలు, ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలకు అవసరమైన మద్దతు అందిస్తూ,విద్యా రంగం సమగ్ర అభివృద్ధికి టీఆర్ఎస్ఎంఏ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలు, విద్యావేత్తలు, పాఠశాలల యాజమాన్యాలు,టీఆర్ఎస్ఎంఏ సభ్యులు పాల్గొనడంతో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు సాదుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి ఎన్.రమేష్ రావు,వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లె వినయ్ కుమార్, అడ్వైసర్ కె. చంద్ర శేఖర్ రెడ్డి, జిల్లా నాయకులు శిరీష,అనంత లక్ష్మి,మూర్తి, రాఘవేందర్ రెడ్డి, జోసెఫ్,బి.వి. ఎన్.స్వామి, నాగేంద్ర బాబు, కె.హర్షిత తదితరులు పాల్గొన్నారు

# సేవా సంకల్ప్ అభియాన్‌లో సేవ చేసే చేతులకు సత్కారం..

**బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మమతారెడ్డి చే అంగన్వాడీ టీచర్లకు బీజేపీ ఘన గౌరవం..**



**కొత్తూరు,(ప్రజావినికిడి):**
గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా కొత్తూరు మండలంలోని ఇమ్మలనర్వ, పెంజర్ల, సిద్దాపూర్ గ్రామాల అంగన్వాడీ టీచర్లను ఘనంగా సన్మానించారు.బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మమతారెడ్డి ఆధ్వర్యంలో, బీజేపీ కొత్తూరు మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డితో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యం, పోషణ,ప్రాథమిక విద్యతో పాటు గ్రామీణ సమాజానికి అంగన్వాడీ టీచర్లు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని కొనియాడారు.చిన్నారులు, గర్భిణీలు,బాలింతలకు సేవలు అందిస్తూ సమాజ ఆరోగ్య,సంక్షేమ రంగాల్లో అంగన్వాడీ టీచర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు మంగలి రమేష్,మండల జనరల్ సెక్రెటరీలు గొడుగు గణేష్,వనం శ్రీనివాస్, మండల కార్యదర్శి భైరవుని నరసింహ,బూత్ అధ్యక్షులు వనం జంగయ్య,పాముల మురళి,సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి,ఇంద్రసేనారెడ్డి,కొండల చారి,కార్యకర్తలు వనం యాదయ్య,కట్ట యాదయ్య, బ్యాగరి శ్రీను,వనం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వీరవనిత చాకలి ఐలమ్మకు జాతీయ బీసీ సేన ఘన నివాళి

**భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన ధీరవనిత ఐలమ్మ..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా జాతీయ బీసీ సేన ఆధ్వర్యంలో ఆమెకు ఘన నివాళులర్పించారు.ఐలమ్మ విగ్రహానికి జాతీయ బీసీ సేన నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారుఈ సందర్భంగా జాతీయ బీసీ సేన నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. నాటి సామాజిక, ఆర్థిక అసమానతలను ఎదుర్కొంటూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆమె సాగించిన పోరాటం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఐలమ్మ, తనపై జరిగిన అన్యాయాన్ని ఎదిరించి ధైర్యంగా పోరాడటం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని తెలిపారు.రోకలిబండను చేతబట్టి నాటి దొరల ఆధిపత్యాన్ని, రజాకార్ల దౌర్జన్యాలను ఎదుర్కొన్న ఐలమ్మ ధైర్యసాహసాలు తెలంగాణ ప్రజల పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. మహిళలు కూడా సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడగలరని చాటిచెప్పిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు.అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయ కమని,ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జాతీయ బీసీ సేన నాయకులు పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం కృషి చేయడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని తెలిపారు.అనంతరం ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సేన ప్రతినిధులు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.3.85 లక్షలకు వినాయక లడ్డూ సొంతం చేసుకున్న రాయికల్ శ్రీనివాస్

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో భక్తిశ్రద్ధలతో లడ్డూ వేలంపాట..**

**షాద్‌నగర్, (ప్రజావినికిడి):**
పట్టణంలో భగత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన వినాయక లడ్డూ వేలంపాటలో ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ రూ.3 లక్షల 85 వేలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటారెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి తదితరుల సమక్షంలో ఉత్సాహంగా సాగిన వేలంపాటలో రాయికల్ శ్రీనివాస్ ఆసక్తిగా పాల్గొని అత్యధిక మొత్తానికి లడ్డూను దక్కించుకున్నారు.
స్థానిక ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై లడ్డూ వేలంపాట కార్యక్రమంలో పాల్గొన్నారు. లడ్డూను సొంతం చేసుకున్న రాయికల్ శ్రీనివాస్ ఎమ్మెల్యే



వీర్లపల్లి శంకర్ సమక్షంలో లడ్డూను తలపై పెట్టుకుని గణనాథుడిపై తన భక్తిని చాటుకున్నారు.ఈ దృశ్యం అక్కడున్న భక్తులను ఆకట్టుకుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, నవరాత్రుల పాటు పూజలు అందుకున్న వినాయకుడి లడ్డూను భక్తిశ్రద్ధలతో వేలంపాటలో సొంతం చేసుకోవడం శు భపరిణామమన్నారు.లడ్డూను దక్కించుకున్న రాయికల్ శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో ఆయన కుటుంబంతో పాటు ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.
భగత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను ఎమ్మెల్యే శంకర్ అభినందించారు.మున్సిపల్ వైస్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు అందే మోహన్ ముదిరాజ్‌తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.
వినాయక ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందించేలా మరింత ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే శంకర్ ఆకాంక్షించారు. గణనాథుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు.

# చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం :ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

**షాద్‌నగర్, (ప్రజావినికిడి):**
పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు,జేఏసీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు.పేదలు,బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. అన్యాయాన్ని ఎదిరించి



ఆత్మగౌరవం కోసం నిలబడిన ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు.చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించడం ద్వారా ఆమె త్యాగాలు,పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేయాలని ఎమ్మెల్యే అన్నారు. బడుగు,బలహీన



వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

# నిర్దవెల్లిలో ఘనంగా చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మండలం నిర్దవెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఘనంగా ఆవిష్కరించారు.గ్రామ రజక సంఘం విజ్ఞప్తి మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా,గ్రామ ప్రజలు,రజక సంఘం నాయకులు, మండల,గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ,తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడిన చాకలి ఐలమ్మ ప్రజల హక్కుల కోసం నిలబడిన స్ఫూర్తిదాయక మహిళ అని కొనియాడారు. ఆమె త్యాగాలు,పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.
గ్రామ రజక సంఘం విజ్ఞప్తిని గౌరవించి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు సహకరించిన రవీందర్ యాదవ్‌ను ఈ సందర్భంగా పలువురు



అభినందించారు. గ్రామంలో ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయడం ఆమె పోరాట చరిత్రకు గుర్తుగా నిలుస్తుందని, యువతకు స్ఫూర్తినిస్తుందని తెలిపారు.చాకలి ఐలమ్మ ఆశయాలు,ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సి ఎస్టీ కమీషన్ సభ్యులు రాంబాల్ నాయక్,మాజీ జడ్పీ వైస్



చైర్మన్ ఈట గణేష్,బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు లక్ష్మీనారాయణ గౌడ్, విశ్వనాథం,మాజీ జడ్పీటీసీ నర్సింగరావు,మాజీ మున్సిపల్ చైర్మన్ దేవేందర్ యాదవ్,మాజీ పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్ గౌడ్, తదితరులు,వివిధ గ్రామాల సర్పంచులు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు ,బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,రజక సంఘం నాయకులు,గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నకిలీ పత్రాలు సృష్టించి విక్రయించారు




**బషీర్ బాగ్, (ప్రజావినికిడి):** తనకు వారసత్వంగా వచ్చిన 9 ఎకరాల 8 గుంటల భూమిని భూ కబ్జాదారులతో మంజుల, సురేందర్ విజయలక్ష్మి సంధ్యారాణిలు కలిసి నకిలీ పత్రాలు సృష్టించి ఇతరులకు విక్రయించారని రైల్వే ఐఎన్టీయూసీ సీనియర్ నాయకుడు, విశ్రాంత రైల్వే ఉద్యోగి, వసగౌని కృష్ణ గౌడ్ ఆరోపించారు.ఈ మేరకు శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా,అల్వాల్ మండలం, యాప్రాల్ గ్రామంలోని సర్వే నెంబర్150, 151లోని 9 ఎకరాల 8 గుంటల భూమిని రెవిన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులకు పెద్ద ఎత్తున డబ్బులు ముట్టజెప్పి ఇతరులకు విక్రయించారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఆ భూములపై కోర్ట్ స్టే ఇచ్చినా కూడా రిజిస్ట్రేషన్ అధికారులు రిజిస్ట్రేషన్ చేశారని వాపోయారు. వారసత్వంగా సంక్రమించిన భూమికి సంబంధించిన పత్రాలు,హక్కు ఆధారాలు తన వద్ద ఉన్నాయని వివరించారు.ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించి భూమి రికార్డులను సమగ్రంగా పరిశీలించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు. లేనిపక్షంలో ఆత్మహత్యే తనకు శరణ్యమని కృష్ణ స్పష్టం చేశారు.

# వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఘన నివాళులు



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా చింతలకుంటలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,భూమి,భుక్తి, విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరాలకు ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విట్టల్ రెడ్డి,జిట్టా రాజశేఖర్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

# కఫీసో ఆడిటోరియం.. కరీంనగర్‌కు సినీ పరిశోధన కేంద్రం..






**కరీంనగర్, సెప్టెంబరు,26 (ప్రజావినికిడి):**
కరీంనగర్‌లో ఐదు దశాబ్దాలకు చేరువైన సినీ, కళా, సాంస్కృతిక ఉద్యమానికి మరో మైలురాయి పడింది. 49 ఏళ్లుగా సినిమా, సాహిత్యం,కళా, సాంస్కృతిక రంగాలకు విశేష సేవలందిస్తున్న కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ (కఫీసో) గోల్డెన్ జూబ్లీకి అడుగుపెడుతున్నవేళ, కళాకారులు,సినీ ప్రియులు, సాహితీవేత్తలకు మరింత విస్తృత వేదికగా నిలిచే నూతన ఆడిటోరియం నిర్మాణానికి శనివారం కరీంనగర్–సిరిసిల్ల బైపాస్ రోడ్డు, పద్మనగర్ వద్ద అంగరంగ వైభవంగా భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖులు, కళాకారులు, రచయితలు,సినీ ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

నూతన ఆడిటోరియం నిర్మాణం పూర్తయితే కరీంనగర్ సినీ పరిశోధన కేంద్రంగా మారనుందని తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై శాఖ డైరెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. కఫీసో ఆధ్వర్యంలో నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 50 ఏళ్ల చరిత్ర కలిగిన ఫిల్మ్ సొసైటీ విభిన్న కార్యక్రమాలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం కఫీసో ఆడిటోరియం భారతదేశంలో రెండో స్థానంలో ఉందని,నూతన ఆడిటోరియం నిర్మాణం పూర్తయితే మొదటి స్థానంలో నిలుస్తుందని పేర్కొన్నారు. ఇది ఉమ్మడి కరీంనగర్ వాసుల కళ నెరవేరబోయే సమయం అన్నారు.

విశిష్ట అతిథి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ, కఫీసో ఆడిటోరియం ఒక పరిశోధన కేంద్రంగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. సినిమా ఆవిర్భావం నుంచి సినిమా చరిత్ర,సినిమా



నిర్మాణం,కళ, సినీ సాహిత్యానికి సంబంధించిన అంశాలన్నీ ఒకే చోట అందుబాటులోకి రానున్నాయని అన్నారు. కఫీసో ఆడిటోరియం గొప్ప ఆదర్శప్రాయంగా నిలుస్తుందని, కరీంనగర్ చరిత్రలో ఇదొక మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

మరో ముఖ్య అతిథి,పూర్వ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు మాట్లాడుతూ 50 ఏళ్ల చరిత్ర కలిగిన ఫిల్మ్ సొసైటీ విభిన్న కార్యక్రమాలను నిర్వహించిందన్నారు. వివిధ భాషల చిత్రాలను ప్రదర్శించి,సినీ సాహిత్యం ద్వారా పిల్లల్లో గొప్ప చైతన్యాన్ని కలిగించినట్లు గుర్తు చేశారు. భాషా సాంస్కృతిక శాఖ సమన్వయంతో అనేక కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ ఆడిటోరియం నిర్మాణానికి తన వంతుగా రూ. 6 లక్షల విరాళాన్ని ప్రకటించారు. నూతన ఆడిటోరియంలో 70 ఎంఎం స్క్రీన్, డాల్బీ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కింది భాగంలో సమావేశ మందిరం,గెస్ట్ రూమ్స్,లైబ్రరీ తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ, భారతీయ సినిమాలను ప్రతిబింబించేలా మ్యూజియంను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రేపటి నుంచే పనులు ప్రారంభించి అత్యంత త్వరగా ఆడిటోరియం నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తన ధ్యేయమన్నారు. ఇందుకు సహృదయుల నుంచి విరాళాలను ఆశిస్తున్నట్లు తెలిపారు.

కఫీసో గోల్డెన్ జూబ్లీ వేడుకలకు నూతన ఆడిటోరియం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమానికి ముందు కఫీసో ప్రధాన కార్యదర్శి లక్ష్మీ గౌతమ్ నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్,పూర్వ సర్పంచ్ గడ్డం శ్రీరాములు, సలహాదారు వరాల మహేష్, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్, బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్ తదితరులు ప్రసంగించారు. కె.ఎస్. అనంతాచార్య కార్యక్రమ సమన్వయం చేయగా,కోల రామచంద్రారెడ్డి స్వాగత వచనాలు అందించారు. ముజాఫర్ కృతజ్ఞతలు తెలిపారు.

నూతన ఆడిటోరియం నిర్మాణానికి బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్,చక్రధర్ రావు రూ. 50 వేల చొప్పున, కలర్ సత్తన్న రూ. 10 వేల విరాళాన్ని ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో కోశాధికారి సి. హెచ్. అనిల్ కుమార్,కే. వెంకటేశం, గాజోజు నాగభూషణం, ప్రకృతి సురేష్, పణిత మునిపల్లి, కందుకూరి అంజయ్య, దశరథం,అనిల్ కుమార్ గౌడ్, పొన్నం శ్రీనివాస్, సదాశ్రీ,తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, తంగెడ అశోక్ రావుతో పాటు సాహితీవేత్తలు, కళాకారులు, రాజకీయ ప్రముఖులు,సినీ అభిమానులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి..

**పెద్దతూప్రలో ఘనంగా 131వ జయంతి వేడుకలు..**



**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 26:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకొని శంషాబాద్ మండలంలోని పెద్దతూప్ర గ్రామంలో రజక సామాజిక వర్గం ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి శంషాబాద్ మండలం మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జయమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి చాకలి ఐలమ్మ స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన ఐలమ్మ మహిళా చైతన్యానికి, సామాజిక మార్పునకు నాంది పలికారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల మాజీ సర్పంచ్ అంకం సుమలత రాజు యాదవ్, ఉపసర్పంచ్ దిద్యాల శేఖర్, వార్డు సభ్యులు దిద్యాల నరేష్ కుమార్,దిద్యాల సునీత రాజు, ఫాక్స్ డైరెక్టర్ దిద్యాల గౌతమ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు దిద్యాల శశికాంత్, ఉపాధ్యక్షుడు జయం రాజు, కార్యవర్గ సభ్యులు బి. విజయ్,ఎన్. శ్రీచరణ్,చిర్ర దాసు,బంగారం ఆంజనేయులు, ఎండి ఆజం, దిద్యాల సురేష్, దిద్యాల చెన్నకేశవ్, దిద్యాల వెంకటయ్య, దిద్యాల పోచయ్య, దిద్యాల రమాకాంత్, దిద్యాల శేఖర్, దిద్యాల గోవర్ధన్, దిద్యాల సందీప్, దిద్యాల స్వామి, దిద్యాల సతీష్, దిద్యాల రాములు, దిద్యాల శ్రీకాంత్, దిద్యాల పరశురాం, దిద్యాల వెంకటేష్, దిద్యాల అంజయ్య, దిద్యాల బాలరాజ్, దిద్యాల ప్రవీణ్, దిద్యాల రమేష్, గంగాపురం అంజయ్య, కట్టుకూరి ప్రవీణ్, కట్కూరి సురేష్, రజక సామాజిక వర్గ సభ్యులు, పార్టీ సీనియర్ కార్యకర్తలు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు.

# పామ్ ఆయిల్ గెలల రవాణాలో అవరోధాలు సృష్టిస్తే సహించం..





**హైదరాబాద్, (ప్రజావినికిడి):**
పామ్ ఆయిల్ గెలల రవాణాలో అవరోధాలు సృష్టిస్తు ఆయిల్ కంపెనీలకు, రైతులకు తీవ్రనష్టాలు కలిగించే చర్యలను సహించేది లేదని తెలంగాణ అయిల్‌పెడ్ జనరల్ మేనేజర్ టి.సుధాకర్ రెడ్డి హెచ్చరించారు. సత్తుపల్లికి చెందిన పామ్ ఆయిల్ గెలల రవాణా కాంట్రాక్టర్ చెలికాని సత్యంబాబు అలియాస్ సిహెచ్ సత్యంబాబు, ఇతర కలెక్షన్స్ సెంటర్ల నిర్వహణ పై అనేక మంది పామాయిల్ రైతుల పిర్యాదు మేరకు అతని సొంత పొలాలతో పాటు పామాయిల్ గెలల రవాణాలో అక్రమాలను గుర్తించి అతని కాంట్రాక్టును సత్వరమే రద్దు చేయడం జరిగింది సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టర్ సత్యంబాబు పామాయిల్ గెలల రవాణా కాంట్రాక్టు కాలంలో రైతులకు సకాలంలో బాటా తూకం నిర్వహించకపోవడం,పదిహేను రోజులకు ఒకసారి కాంటా నిర్వహించి రవాణా చేయడం,కాంటా జరిగిన మొత్తం తూకం నుండి తరుగు తీయడం, సేకరించి పామ్ ఆయిల్ గెలలను రెండు నుంచి నాలుగు రోజులు నిల్వ ఉంచి ప్యాక్టరీలకు రవాణా చేయడం వల్ల పామాయిల్ లో ఎఫ్ఎఫ్ఏ పెరిగి ఆయిల్ ఫెడ్కు, రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం జరుగుతున్నందున అతని పై చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే పామాయిల్ గెలల రవాణా కాంట్రాక్టు కాల పరిమితి ముగిసినందున నూతన కఠిన నియమ నిబందనల ప్రకారం కొత్త టెండర్లను ఆహ్వానించడానికి నిర్ణయం తీసుకున్నట్లు టీజీ ఆయిల్ ఫెడ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం పామాయిల్ గెలల దిగుబడి ఎక్కువగా వచ్చే పీక్స్ సీజన్ అవ్వడం వలన మర్లపాడు చుట్టూ పక్కల గ్రామాలలో పామాయిల్ గెలల కోసం నెలలో రెండు రోజులు మాత్రమే కాంటా పెట్టడం వల్ల రైతులు పామ్ ఆయిల్ గెలలను సిసి సెంటరకు తీసుకువచ్చి గంటల తరబడి ఎదురుచూడడం వంటి నిర్లక్ష్య వైఖరిపై బీజీ ఆయిల్ ఫెడ్ యాజమాన్యం అనేక సార్లు కాంట్రాక్టర్ సత్యంబాబును హెచ్చరించాను అతనిలో ఎలాంటి మార్పు లేదని,అలాగే ఫామ్ ఆయిల్ రైతులకు సరిపడే కూలీలు,ట్రాక్టర్ /వాహనాలకు విపరీతమైన డిమాండ్ ఉండడం వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు పామాయిల్ గెలలను సి సి సెంటర్ కు తీసుకు వస్తున్న కూడా పామాయిల్ రవాణా కాంట్రాక్టు అనేక ఇబ్బందులు సృష్టిస్తుండడంతో టీజీఆయిల్ పెడ్ ఫామ్ ఆయిల్ రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. భవిష్యత్తులో రవాణా కాంట్రాక్టు పామ్ ఆయిల్ రైతుల పామాయిల్ గెలలను రవాణాలో అవరోదాలు కల్పించినట్లు తమ దృష్టికి వస్తే అధికారులు, అనధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని టీజీ ఆయిల్ ఫెడ్ యాజమాన్యం హెచ్చరించింది. పామ్ ఆయిల్ రైతుల సంక్షేమమే ఆయిల్ ఫెడ్ ద్వేయంగా పనిచేస్తుందని

పామాయిల్ గెలల రవాణా కాంట్రాక్టర్ విషయంలో ఎలాంటి వ్యక్తిగత కక్ష సాధింపు లేదా వివక్ష లేదని,కేవలం పామాయిల్ రైతుల నుండి అందిన ఫిర్యాదుల ఆధారంగా బీజీ ఆయిల్ ఫెడ్ నిబంధనల ప్రకారం తీసుకున్న చర్యలు పరిపాలన నిర్ణయం మాత్రమేనని అధికారులు స్పష్టం చేశారు. ఈ సమావేశం లో ఆయిల్ పెడ్ మేనేజర్ లు పి.తిరుమలేశ్వర్ రెడ్డి,జె సత్యనారాయణ, సంబంధిత టీజీ ఆయిల్ ఫెడ్ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

# రూ.2.15 లక్షలకు లడ్డూ కైవసం..

**చౌదర్ గూడలో ఉత్సాహంగా లడ్డూ వేలం..**

**నాగారం శ్రీనివాస్ గౌడ్-బాల వేణి కుటుంబానికి దక్కిన లడ్డూ..**



**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 26:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని చౌదర్ గూడ గ్రామంలో సాయి హనుమాన్ యూత్ అసోసియేషన్ లడ్డూ వేలం ఉత్సాహంగా జరిగింది. ఈ వేలంలో రూ. 2,15,000లకు నాగారం శ్రీనివాస్ గౌడ్–బాల వేణి కుటుంబం లడ్డూను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, వేలంపాటలో వినాయకుడి లడ్డూను దక్కించుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. విఘ్నేశ్వరుడి కటాక్షంతోనే లడ్డూను దక్కించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. లడ్డూ వేలం కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వేలంలో పాల్గొన్నారు. వేలం అనంతరం లడ్డూను దక్కించుకున్న కుటుంబ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

## రూ 5,56,000/- లక్షలకు వినాయక లడ్డు సొంతం చేసుకున్న మామిళ్ళ నరసింహ కుమారులు

**మామిళ్ల సాయి యాదవ్, మామిళ్ల సందీప్ యాదవ్ మామిళ్ల రాకేష్ యాదవ్**

**భక్తిశ్రద్ధలతో కొనసాగిన వినాయక నవరాత్రి ఉత్సవాలు**



**శంషాబాద్,(ప్రజావినికిడి):**
శంషాబాద్ మండల హమీదులనగర గ్రామం కూటమైసమ్మ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిచిన గణనాథుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణనాథుని లడ్డూ వేలం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేలం కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి ఏడాది వేలం పాటలో పోటీ మరింత పెరుగుతోంది. వినాయకుడి లడ్డూ వేలం రూ. 5,56,000/లక్షలకు నాలుగవసారి మామిళ్ల నర్సింహ యాదవ్ కుమారులు మామిళ్ల సాయి యాదవ్, మామిళ్ల సందీప్ యాదవ్ మామిళ్ల రాకేష్ యాదవ్ కైవసం చేసుకున్నారు. పవిత్ర ప్రసాదం తమ కుటుంబానికి దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు వారు తెలిపారు. మొదటి సారి రూ. 1,06,000/-, రెండవ సారి రూ. 1,15,000/-, మూడవ సారిరూ. 1,25,000/- మరియు నాలుగవ సారి రూ. 5,56,000/- లకు కైవసం చేసుకోవడం జరిగింది. లడ్డూను దక్కించుకున్న మామిళ్ళ నరసింహ కుమార కు ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.,గణనాథుని ఆశీస్సులు ప్రతి ఒక్కరి కుటుంబంపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ కోట మైసమ్మ యూత్ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,యువత నిర్వహించేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్**



**రాజేంద్రనగర్ (ప్రజావినికిడి): సెప్టెంబర్ 26:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బహుజన బిడ్డ, దొరల గడీలను ఎదిరించిన వీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకుని కాటేదాన్ డివిజన్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి, డివిజన్ల ముఖ్య నాయకులతో కలిసి కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ, సామాన్య కుటుంబంలో జన్మించిన చాకలి ఐలమ్మ నాటి నిజాం పాలనలో భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడారని అన్నారు. తన భూమి, పంటపై హక్కు కోసం దొరల పెత్తనాన్ని ఎదిరించి, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వీరవనితగా ఐలమ్మ చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ఐలమ్మ రగిలించిన పోరాట స్ఫూర్తి చుట్టుపక్కల గ్రామాలకు విస్తరించి,నిజాం వ్యతిరేక సాయుధ పోరాటానికి బలమైన పునాది వేసిందన్నారు. పీడిత ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఆమె ఒక దిక్సూచిగా నిలిచారని పేర్కొన్నారు. మహిళలు అబలలు కాదని, అన్యాయాన్ని ఎదురిస్తే రాణి చండిలా తిరగబడగలరని ఐలమ్మ తన పోరాటంతో నిరూపించారని అన్నారు. అన్యాయాన్ని ఎదిరించడంలో ఆమె చూపిన తెగువ, ఆత్మస్థైర్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని,ఐలమ్మకు అర్పించే నిజమైన నివాళి ఆమె ఆశయాలను కొనసాగించడమేనని ఎస్. వెంకటేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆర్. వెంకటయ్య, అక్యాం రాఘవేందర్ యాదవ్, మైసిరెడ్డి, బాలరాజు యాదవ్,ఎస్. అశోక్ కుమార్, రామస్వామి, కొంపల్లి జగదీష్, జంపుల భగవాన్ దాస్,సునీల్, పద్మ,పుష్ప, రాజు,చికెన్ మోహన్,శేఖర్, సూరి,నాని, అఖిల్,తుకారం, గడ్డం మహేష్‌తో పాటు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## చంద్రుపట్ల పాఠశాలను సందర్శించిన కాంప్లెక్స్ విద్యాధికారి ఉపాధ్యాయులు, విద్యార్థులపై ప్రశంసలు



**వాజేడు సెప్టెంబర్ 27,(ప్రజావినికిడి):**
చంద్రుపట్ల ప్రభుత్వ పాఠశాలను ధర్మవరం కాంప్లెక్స్ విద్యా పర్యవేక్షణ అధికారి వేణుగోపాల్,
శనివారం విజిట్ చేయడం జరిగినది. ఈ సందర్భంగా వారు పాఠశాలలోని విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల అభ్యసన స్థాయి, ఎఫ్ఎల్ఎన్ నిర్వహణ, ఉపాధ్యాయుల బోధనా,రికార్డుల నిర్వహణ, పాఠశాల పరిసరాలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి విద్యార్థులతో చదివించడం, రాయించడం చేసి అభ్యసన సామర్థ్యాన్ని, విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించారు. పాఠ్యాంశాలపై అవగాహన కలిగి ఉండటం పట్ల అధికారి సంతోషం వ్యక్తం చేసి వారిని అభినందించారుఅదేవిధంగా ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యా ప్రగతి కోసం చేస్తున్న కృషిని, విద్యార్థుల పట్ల చూపుతున్న శ్రద్ధను అధికారి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ ఉపాధ్యాయులు బిక్షపతి కాంప్లెక్స్ సి అర్ పి.రాంబాబు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### గణనాథుని ఆశీస్సులు దూసకల్ గ్రామ ప్రజలపై ఉండాలని

## ప్రత్యేక మంగళ హారతిలతో గణపతిని వేడుకున్న దూసకల్ మహిళలు..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
దూసకల్ గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మహిళలు సంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల చివరి రోజున విఘ్నేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దీపహారతులతో భక్తిపూర్వకంగా హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు గణనాథుడిని కొలుస్తూ తమ కుటుంబాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివేరియాలని ప్రార్థించారు. గ్రామ ప్రజలందరూ ఆనందంగా, సంతోషంగా ఐకమత్యంతో జీవించాలని, ప్రతి కుటుంబంపై గణపతి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వేడుకున్నారు.
జీవితంలో ఎదురయ్యే విఘ్నాలన్నీ తొలగించి,ప్రతి ఒక్కరికీ విజయాలు, శుభాలు ప్రసాదించాలని విఘ్నేశ్వర స్వామివారిని భక్తిపూర్వకంగా ప్రార్థించారు. అనంతరం ప్రత్యేక హారతులతో గణనాథుడికి భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## భక్తి భావాన్ని చాటుతున్న భజనలతో భక్తులను ఆకట్టుకున్న దూసకల్ భజన మండలి సభ్యులకు ఘన సన్మానం..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
దూసకల్ గ్రామంలో వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ గ్రామ పెద్ద వినాయకుని వద్ద భజన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ భజన కార్యక్రమాల ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తూ, వినాయక నవరాత్రి వేడుకలకు మరింత శోభనమాయంగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పెద్ద వినాయకుని నవభారత యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో భజన మండలి సభ్యులను ఘనంగా సన్మానం చేశారు వినాయక ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ భజన కార్యక్రమాలకు హాజరై,తమ గానంతో భక్తులను అలరించడంతో పాటు ఉత్సవాలను విజయవంతం చేయడంలో అందించిన సహకారాన్ని కమిటీ సభ్యులు అభినందించారు. వినాయక చవితి వేడుకల్లో తమకు సహకరించి, భజన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన దూసకల్ భజన మండలి సభ్యులకు నవభారత యూత్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామంలో నిర్వహించే ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఇదే విధంగా సహకారం అందించాలని కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో నవభారత యూత్ సభ్యులు,భజన మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

### ఎస్ జి టి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని

## జడ్.పి.హెచ్.ఎస్ శివరాంపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కు వినతిపత్రం




**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి)** సెప్టెంబర్ 26, ఎస్ జి టి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జడ్.పి.హెచ్.ఎస్ శివరాంపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీను నాయక్‌కు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎస్ జి టి ఉపాధ్యాయులు తరగతి గదుల్లో బోధన చేయడం కంటే బోధనేతర పనులతో ఎక్కువగా నిమగ్నమవుతున్నారని, బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని కోరారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని, ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమం కారణంగా ఉపాధ్యాయులపై పెరుగుతున్న మానసిక ఒత్తిడిని తగ్గించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జీవో -25ను సవరించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక పిఎస్ హెచ్ఎం పోస్టును మంజూరు చేయాలని,ఎస్ జి టి ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. జేఏసీ చైర్మన్ మారెడ్డి జగదీశ్ ఎస్ జి టి ఉపాధ్యాయులపై చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సుమారు 41,000 మంది ఎస్ జి టి ఉపాధ్యాయులు తెలంగాణలో పనిచేస్తున్న నేపథ్యంలో వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొంటూ, చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు బాలకృష్ణ మదగని,ఎస్ టి యు మండల అధ్యక్షులు కామిశెట్టి వెంకటయ్య, కాంప్లెక్స్ సెక్రటరీ ఎం.షాలిని,ఆర్ పి శ్రీనివాస్ రెడ్డి, తదితర ఎస్ జి టిఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాజేడులో ఆదివాసీ మహాదర్నా -కరపత్రాల ఆవిష్కరణ

**హైదరాబాద్ మహాధర్నాకు ఆదివాసీ సంఘాల జేఏసి పిలుపు.**

**అక్టోబర్ 14న హైదరాబాద్‌లో ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నా**

**ఆదివాసీ హక్కుల కోసం 'చలో హైదరాబాద్'కు భారీగా తరలిరండి**

**రాజ్యాంగ హక్కుల పరిరక్షణే లక్ష్యం.. ఆదివాసీల మహాధర్నాను విజయవంతం చేయాలి.**

**1/70 చట్టం, ఉద్యోగాలు, పోడు హక్కుల కోసం ఉద్యమ శంఖారావం.**



**వాజేడు, సెప్టెంబర్ 27,(ప్రజావినికిడి):**
ఆదివాసీల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ,భూమి హక్కులు, ఉద్యోగాలు, విద్య, ఉపాధి, పోడు భూములకు హక్కు పత్రాలు, ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి తదితర సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 14న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నా ను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. వాజేడు తాసిల్దార్ కార్యాలయం వద్ద మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం స్పష్టమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో భూముల రక్షణకు 1/70 చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పోడు సాగుదారుల సమస్యలను పరిష్కరించి అర్హులైన ప్రతి కుటుంబానికి హక్కు పత్రాలు అందించాలని కోరారు. ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే అంశంపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని,జీవో నెంబర్-3 స్థానంలో కొత్త జీవో తీసుకురావడానికి గిరిజన సలహా మండలి చర్యలు చేపట్టాలని అన్నారు. 1/70 చట్టంపై గిరిజనేతరులు దాఖలు చేసిన కేసులో ప్రభుత్వం సుప్రీంకోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే 29 శాఖలకు సంబంధించిన జీవోలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.
తెలంగాణలో పోడు సాగు చేస్తున్న అర్హులైన రైతులకు హక్కు పత్రాలు అందించడంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని నాయకులు కోరారు. ఆదివాసీల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఆదివాసీ సంఘాలతో చర్చలు జరిపి కార్యాచరణ రూపొందించాలని సూచించారు.
అక్టోబర్ 14న హైదరాబాద్‌లో జరిగే ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నాకు ఆదివాసీ ప్రజలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం శాంతియుతంగా, ఐక్యంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు.
ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య, జాతీయ కో-కన్వీనర్ పోదెం కృష్ణ ప్రసాద్,పాయం జానకిరావు,ఎట్టి రాజబాబు,ఆదివాసి నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కోర్స నరసింహమూర్తి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు,జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్,మండల అధ్యక్షుడు మోడెం నాగరాజు, ప్రసాద్,పాయం అజయ్,గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనం సాయి, ములుగు జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్. బోదేబోయిన సురేష్, ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా నాయకులు పర్శిక సతీష్,కృష్ణ బాబు,ఏటూరునాగారం మండల అధ్యక్షులు తాటి నీలాద్రి, ఉపాధ్యక్షులు కోరం సుధాకర్,కారం సురేందర్,కంబాల పల్లి హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## మోకాళ్ళ పై నిలబడి నిరసన తెలిపిన రైతులు..

**ఎట్టకేలకు దిగొచ్చిన రెవిన్యూ అధికారులు..**

**హర్షం వ్యక్తం చేసిన రైతులు..**

**మద్దతు తెలిపిన జిఎస్పి,ఎఎస్పి, తుడుందెబ్బ సంఘాలు..**





**వాజేడు,సెప్టెంబర్ 27,(ప్రజావినికిడి):**
ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో ఎడజర్లపల్లి రైతులు చేపట్టిన దీక్షలు శనివారనికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఐదో రోజు దీక్షలకు జిఎస్పీ, ఏఎస్పీ, తుడుందెబ్బ ఆదివాసీ సంఘాలు మద్దతూ తెలిపాయి. ఐదో రోజు అయినా రెవిన్యూ అధికారులు న్యాయం చేయకపోవడం తో తహసీల్దార్ కార్యాలయం ముందు మోకాళ్ళ పై కూర్చొని రైతులు నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ లను సస్పెండ్ చేయాలనీ నినాదాలు చేశారు. ఏఎన్ఎస్,రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహామూర్తి మాట్లాడుతూ, షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనులు సర్వ హక్కులు ఉన్నప్పటికీ న్యాయం కోసం మోకాళ్ళ పై కుర్చుని న్యాయం చేయమని బిచ్చం ఆందుకునే దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది అని అయన అన్నారు. జిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ, రెవిన్యూ అధికారుల చిత్తశుద్ధి లోపం వల్లనే ఆదివాసీలకు న్యాయం జరగడం లేదన్నారు. ఏఎస్పీ జిల్లా అధ్యక్షులు పర్శిక సతీష్ మాట్లాడుతూ, ఎడజర్లపల్లి ఆదివాసీ రైతులకు న్యాయం చేయకపోతే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తాం అన్నారు. తుడుందెబ్బ జాతీయ అధ్యక్షులు మాట్లాడుతూ, అసైన్మెంట్ భూములను గిరిజనేతరులు దర్జాగా కబ్జా చేస్తూ ఉంటే రెవిన్యూ అధికారులు ఏమి చేస్తున్నట్టు అని మండిపడ్డారు. దీనితో తహసీల్దార్ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ రాము కబ్జా చేసిన గిరిజనేతరుడిని గిరిజనుల పట్టా భూముల్లోకి వెళ్లోద్దని చెప్పడం జరిగింది. గిరిజన రైతులకు ఉన్న అసైన్మెంట్ రికార్డులను పరిశీలించి పంచనామా రిపోర్ట్ ఇవ్వడం జరిగింది. గిరిజనుల భూములు గిరిజనులకే చెందుతాయని 1/70 చట్టం ప్రకారం గిరిజనేతరులకు గిరిజనుల భూములు చెల్లావని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్ పంచనామా రిపోర్ట్ రైతులకు అందజేసినారు. నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప జేసినారు. ఈ దీక్షలో ఏఎన్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్, వాజేడు మండల అధ్యక్షుడు మొడెం నాగరాజు, ఉపాధ్యక్షుడు యాలం అశోక్,మీడియా అధ్యక్షుడు పాయం అజయ్, కార్యదర్శులు తల్లడి ప్రసాద్, కోరం మనోజ్, కంబాలపల్లి హరినాద్, ఆదివాసులు తల్లడి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పడవ ప్రయాణమే దిక్కు..

**భద్రతపై ఆందోళన.. -ఇసుకవాగు వద్ద తాత్కాలిక రహదారి గోదావరి ముంపునకు గురి..**

**కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో గ్రామీణ ప్రజలకు తప్పని తిప్పలు.. -ఇదే అదునుగా అధిక పడవ చార్జీలు వసూలు చేస్తున్నారంటూ ప్రయాణికుల ఆవేదన..**



నీట మునిగిన ఇసుక వాగు తాత్కాలిక రోడ్డు



పడవ ప్రయాణికులు

**వాజేడు, సెప్టెంబర్ 27,(ప్రజావినికిడి):**
గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నదిలో వరద ప్రవాహం పెరిగింది. దీంతో పెద్దగొల్లగూడెం-చీకుపల్లి మధ్య ఇసుకవాగు వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి గోదావరి వరద నీటిలో మునిగిపోయిందిదీంతో రాకపోకలు నిలిచిపోవడంతో గ్రామీణ ప్రజలకు మరోసారి పడవ ప్రయాణమే ఆధారంగా మారింది.
తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాన్ని కలుపుతూ టేకులగూడెం జాతీయ రహదారి-163పై రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పనులు,వైద్యం, విద్య, నిత్యావసరాల కోసం వెళ్లాల్సిన ప్రజలు పడవలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**అధిక చార్జీలపై ప్రయాణికుల ఆవేదన**

రహదారి ముంపునకు గురైన పరిస్థితిని కొందరు పడవ నిర్వాహకులు అవకాశంగా తీసుకుని ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ సమయాల్లో ఉండే చార్జీల కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి సరైన చార్జీలను నిర్ధారించాలని కోరుతున్నారు.

**పడవలో పరిమితికి మించి ప్రయాణికులా?**

మరోవైపు పడవల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. వరద ఉధృతి కొనసాగుతున్న సమయంలో అధిక సంఖ్యలో ప్రయాణికులను పడవల్లో తరలించడం ప్రమాదకరమని స్థానికులు చెబుతున్నారు. పడవ ప్రయాణంలో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? ప్రయాణికులకు అవసరమైన రక్షణ పరికరాలు అందుబాటులో ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**శాశ్వత రహదారి నిర్మాణం ఎప్పుడంటూ ప్రశ్న**

ప్రతిసారి భారీ వర్షాలు,వరదలు వచ్చినప్పుడు తాత్కాలిక రహదారి ముంపునకు గురవడం,పడవ ప్రయాణం ప్రారంభించడం పరిపాటిగా మారిందని స్థానికులు అంటున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా తాత్కాలిక ఏర్పాట్లతో కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ తక్షణమే స్పందించి రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

**అప్రమత్తంగా ఉండాలి..: ఎస్ఐ**

గోదావరి వరద పరిస్థితుల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేరూరు ఎస్ఐ గుర్రం కృష్ణ ప్రసాద్ సూచించారు. వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అవసరం లేని ప్రయాణాలను నివారించాలని, అధికారుల సూచనలు పాటించాలని ఆయన కోరారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి): సెప్టెంబర్ 26,**తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఎల్బీనగర్ లోని చింతలకుంట చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాజనసోషలిస్ట్ పార్టీ సరూర్ నగర్ మండలం అధ్యక్షులు భీం రాజ్ వడ్డెర ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకులు పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు బత్తిన సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణా రైతాంగా సాయుధ పోరాటంలో భూస్వామ్య దొరల అరాచకాలకు వ్యతిరేకంగా దైర్యంగా పోరాడిన వీర వనిత అని అన్నారు.ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.అమరవీరుల పోరాట త్యాగాలను నేటి తరానికి తెలియచేయలన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి కన్వినర్ జిల్లా బత్తిన సుధాకర్ మాదిగ, మాజీ ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ మాదిగ,అనంత నరసింహ మాదిగ ఎంఎస్పీ మన్సు రాబాద్ డివిజన్ అధ్యక్షులు, నర్రా శ్రీనివాసు మాదిగ ఎంఎస్పీ డివిజన్ నాయకులు శివ పద్మశాలి, భీంరాజ్.వడ్డెర ఎంఎస్పీ సరూర్ నగర్ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ముల్ నర్వలో నిమజ్జనానికి బయలుదేరిన గణపయ్య

### ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి




**కొత్తూరు,(ప్రజావినికిడి):**మండలంలోని ఇన్ముల్ నర్వలో అరుణోదయ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక నిమజ్జనానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు.నిమజ్జన ఊరేగింపులో గ్రామంలోని యువత,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.డప్పు చప్పుళ్లు,భక్తి గీతాలు,గణపతి నామస్మరణతో ఇన్ముల్ నర్వలో పండుగ వాతావరణం నెలకొంది.యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని గణనాథుడికి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత గోపాల్ నాయక్,మాజీ సర్పంచ్ అజయ్ నాయక్,నాయకులు శ్యామ్ రెడ్డి,ఇంద్రశేన రెడ్డి, కుమార్,గణేష్,మహేశ్వర్ రెడ్డి, శివ చారి,నవాజ్,ఇన్ముల్ నార్వ కేసీఆర్,గ్రామస్థులు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాగులపల్లిలో గణపయ్య నిమర్జనానికి హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఫరుక్ నగర్ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గణేష్ నిమజ్జన మహోత్సవాన్ని గ్రామస్థులు అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఉత్సవాలలో ఆయన పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. నవరాత్రుల పొడుగునా భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న లంబోదరుడిని శాంతియుత వాతావరణంలో, సంప్రదాయబద్ధంగా సాగనంపడం అభినందనీయమన్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందిస్తూ నిర్వహిస్తున్న




కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను,మానసిక ప్రశాంతతను నింపుతాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాగులపల్లి సర్పంచ్ రాధిక అశోక్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ యాదయ్య,గ్రామ పెద్దలు యువకులు గోపాల్ రెడ్డి,మల్ల రెడ్డి,నర్సిమ రెడ్డి,కుమార్ గౌడ్, శ్రీనివాస్,రఘురామ్ ఉత్సవ కమిటీ సభ్యులు,యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ, కర్ణాటక పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారు: జగదీశ్ రెడ్డి

**విద్యుత్ రంగాన్ని రేవంత్ ప్రభుత్వం నాశనం చేసిందన్న జగదీశ్ రెడ్డి**

**వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి రేవంత్ డైవర్షన్ డ్రామాలు ఆడుతున్నారని విమర్శ**

**విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్**

**సెప్టెంబర్ 26(ప్రజావినికిడి):**
కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ… ఇచ్చిన హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని, సాగు, తాగునీటితో పాటు విద్యుత్ రంగంలోనూ అరాచకం సృష్టిస్తోందని మండిపడ్డారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎప్పుడూ డైవర్షన్ డ్రామాలు ఆడుతుంటారని దుయ్యబట్టారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని, ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఏపీ, కర్ణాటక ప్రభుత్వాల పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారని దుయ్యబట్టారు.
ఇక యాదాద్రి పవర్ ప్లాంట్‌పై కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, సిమెంట్



పరిశ్రమలకు అవసరమైన యాష్ (బూడిద) అవసరాలను దృష్టిలో ఉంచుకునే దాన్ని దామరచర్లలో ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఎండిపోతున్న పొలాలు సీఎం రోజువారీ డ్రామాలతో పండవని, ఇప్పటికైనా అనవసరపు పనులు మాని పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్ చేశారు.

పాలిచ్చే ఆవులాంటి ట్రాన్స్‌కోను తన సన్నిహితులకు కట్టబెట్టేందుకు సీఎం రేవంత్ కుట్ర పన్నుతున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఢిల్లీ, ముంబై, ఒడిశా వంటి ప్రాంతాల్లో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించిన చోట ప్రజలపై విపరీతమైన భారం పడిందని అన్నారు. కేసీఆర్ మీద ఎంత ఒత్తిడి ఉన్నా నాటి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేయలేదని, కానీ ప్రస్తుత సర్కార్ మాత్రం కమీషన్లకు ఆశపడి ట్రాన్స్‌కో లక్షల కోట్ల ఆస్తులను కారుచౌకగా అమ్మేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ట్రాన్స్‌కో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ప్రశ్నించిన అధికారులపై ఏసీబీ కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అనుసరించే ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ తీవ్రంగా పోరాడుతుందని హెచ్చరించారు.
నాటి సీఎం కేసీఆర్ చొరవతోనే తెలంగాణ చీకట్ల నుంచి వెలుగులోకి వచ్చిందని కొనియాడారు. అసాధ్యమనుకున్న 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను కొన్ని నెలల వ్యవధిలోనే అన్ని వర్గాలకు అందించిన ఘనత బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు. కేవలం ట్రాన్స్‌కోపైనే రూ.36 వేల కోట్లు వెచ్చించి, ఎక్కడ విద్యుత్ సరఫరా నిలిచినా మరో మార్గం ద్వారా అనుసంధానించే అధునాతన గ్రిడ్ వ్యవస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.

# అకన్ పల్లి గణేష్ లడ్డూని దక్కించుకున్న ఎర్సని సంజీవ యాదవ్



**మహేశ్వరం, (ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధిలోని అకన్ పల్లి గ్రామంలోని బీసీ కాలనీ హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలువుదీరిన వినాయకుడి లడ్డు వేలం పాట భక్తుల కోలహాల మధ్య అత్యంత ఉత్సాహంగా సాగింది.తీవ్ర పోటీ నెలకొన్న ఈ వేలంలో గణనాధుడి లడ్డూ ప్రసాదం ( 34,500 ) ముప్పై నాలుగు వేల ఐదు వందలు పలికింది. శనివారం బీసీ కాలనీ హనుమాన్ యూత్ అసోసియేషన్ వినాయక మండపాల వద్ద నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాటలో ఎర్సని సంజీవ యాదవ్ వేలం పాట పాడి దక్కించుకున్నారు.గణనాథుడి లడ్డూను కైవసం చేసుకున్న సంజీవ యాదవ్ కు ఉత్సవ నిరాహాకులు శాలువాతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలు భక్తులు మహిళలు యువకులు, సంఘం సభ్యులు పాల్గొని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# విద్యార్థులు క్రమశిక్షణ తో ఎదగాలి..

### సమయాన్ని వృధా చేయకూడదు.. - సోషల్ మీడియాకు బానిసలు కాకూడదు..

### షాద్ నగర్ డీసిపి శిరీష రాఘవేందర్..

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
జీవితంలో సమయం చాలా ముఖ్యమైనదని దానిని విద్యార్థులు వృధాచేయకుండా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. పట్టణంలోని విశ్వభారతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల ఫెస్ట్ కి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, జీవితంలో




ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమని..ఈ దశలో విద్యార్థులు చెడు అలవాట్లకు.. మారక ద్రవ్యాలకు.. సోషల్ మీడియా ప్రభావానికి.. బానిసలు కాకుండా..ఈ వయసులో మిమ్మల్ని మీరు నియంత్రించుకొని సరైన మార్గంలో నడుచుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆమె అన్నారు. ఒక్కసారి విద్యార్థులు తప్పటడుగులు వేస్తే మీ జీవితం బాధాకరంగా మారిపోతుందని తద్వారా మీరు మీ యొక్క సంతోషకరమైన జీవితాన్ని కోల్పోతారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శివ కుమార్, కళాశాల యాజమాన్యం పార్థసారథి, వీరభద్ర.. శశికాంత్ రావు, కరీం, మధుసూదన్, కృష్ణయ్య.. వినోద్,చందు,శివ,రాములు, ఉపన్యాసక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

### రజక వృత్తి దారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలకృష్ణ

**ఎల్బీనగర్,(ప్రజావినికిడి): సెప్టెంబర్ 26,**
తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చిట్యాల ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా రజక వృత్తి దారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలకృష్ణ చింతలకుంట చౌరస్తాలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నేటి యువత చాకలి ఐలమ్మ ను పూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోరాటం అమోఘమన్నారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు అరవింద్, కొత్తపేట్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్, నరసింహ, వెంకటేష్ , రామకృష్ణ ,పగిళ్ల స్వామి,గోవింద్ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



# టైర్ బ్లాస్ట్‌తో డివైడర్‌ను ఢీకొన్న కారు

### త్రుటిలో తప్పిన పెను ప్రమాదం.. సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు

**శంషాబాద్, (ప్రజావినికిడి): సెప్టెంబర్ 26,**
శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై కారు టైర్ బ్లాస్ట్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఘటనలో శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న వారందరూ సురక్షితంగా బయటపడ్డారు.సంగారెడ్డికి చెందిన ఓ కుటుంబం టయోటా గ్లాంజా కారులో వండర్లా అమ్యూజ్‌మెంట్ పార్క్‌కు



వెళ్లి తిరిగి సంగారెడ్డికి బయలుదేరింది. శంషాబాద్ ఓ ఆర్ ఆర్ పైకి చేరుకున్న సమయంలో ఒక్కసారిగా కారు టైర్ బ్లాస్ట్ కావడంతో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. కారు వేగం తక్కువగా ఉండటంతో డివైడర్‌పైకి దూసుకెళ్లి అక్కడే ఆగిపోయింది. ప్రమాదంలో కారు స్వల్పంగా దెబ్బతిన్నప్పటికీ, కారులో ఉన్న ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న ఓ ఆర్ ఆర్ పెట్రోలింగ్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ప్రమాదానికి గురైన కారును రహదారి నుంచి పక్కకు తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# పెరిగిన పీఎఫ్ వేతన పరిమితి..

## మీ శాలరీ, పొదుపుపై ఎలాంటి ప్రభావం ఉంటుంది?

**పీఎఫ్ వేతన పరిమితి రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంపు**

**ఉద్యోగి పీఎఫ్ వాటా రూ.3,000 వరకు పెరిగే ఛాన్స్**

**సంస్థ వాటా కూడా రూ.3,000 వరకు పెరిగే అవకాశం**

**ఈపీఎస్ వాటా రూ.2,083 వరకు పెరిగే అవకాశం**

**అదనపు పొదుపుతో రిటైర్మెంట్ నిధి పెరగొచ్చు**




**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 26 (ప్రజావినికిడి):**
నెల జీతం వస్తుంది.. ఖర్చులు పోతాయి.. మిగిలిన దాంట్లో కొంత పీఎఫ్‌లోకి వెళుతుంది. ఉద్యోగ జీవితంలో పెద్దగా పట్టించుకోని ఈ చిన్న మొత్తం.. రిటైర్మెంట్ సమయానికి పెద్ద మొత్తంగా మారుతుంది. ఇప్పుడు పీఎఫ్ లెక్కల్లో కీలక మార్పు వచ్చింది. వేతన పరిమితిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచడంతో ఉద్యోగుల నెలవారీ పొదుపు పెరగనుంది. మరి ఈ మార్పుతో మీ జీతం నుంచి ఎంత పీఎఫ్ కట్ అవుతుంది? సంస్థ ఎంత జమ చేస్తుంది? పెన్షన్‌పై ప్రభావం ఏంటి?

### అసలు మార్పు ఏంటి?

ఇప్పటివరకు పీఎఫ్ కోసం నెల జీతంలో గరిష్ఠంగా రూ.15 వేలనే పరిగణించేవారు. ఈ మొత్తంపై 12 శాతం చొప్పున ఉద్యోగి, సంస్థ పీఎఫ్‌కు రూ.1,800 చొప్పున చెల్లించేవారు. ఇప్పుడు ఈ పరిమితిని రూ.25 వేలకు పెంచారు. అంటే 12 శాతం లెక్కన ఉద్యోగి వాటా రూ.3,000 వరకు పెరగొచ్చు. సంస్థ కూడా రూ.3,000 వరకు జమ చేయొచ్చు. దీంతో పీఎఫ్ ఖాతాలోకి వెళ్లే మొత్తం పెరుగుతుంది.

### ఎవరికి ఎక్కువ ప్రయోజనం?

బేసిక్ జీతం, డీఏ కలిపి రూ.15 వేల నుంచి రూ.25 వేల మధ్య ఉన్న ఉద్యోగులకు ఈ మార్పు ఎక్కువగా ఉపయోగపడొచ్చు. గతంలో రూ.15 వేల వరకు మాత్రమే పీఎఫ్ లెక్కించేవారు. ఇక కొత్త పరిమితి వర్తించే చోట రూ.25 వేల వరకు లెక్కిస్తారు. అయితే ఇప్పటికే పూర్తి బేసిక్ జీతంపై పీఎఫ్ చెల్లిస్తున్న ఉద్యోగులకు ఈ మార్పుతో ప్రత్యేకంగా అదనపు ప్రభావం ఉండదు.

### పెన్షన్ వాటా కూడా పెరుగుతుంది

పీఎఫ్‌లో సంస్థ చెల్లించే 12 శాతం మొత్తంలో కొంత భాగం ఉద్యోగుల పెన్షన్ పథకం (ఈపీఎస్)కు వెళుతుంది. గతంలో రూ.15 వేల పరిమితిపై 8.33 శాతం లెక్కన నెలకు గరిష్ఠంగా రూ.1,250 ఈపీఎస్‌కు వెళ్లేది.
ఇప్పుడు పరిమితి రూ.25 వేలకు పెరగడంతో ఈపీఎస్ వాటా నెలకు రూ.2,083 వరకు పెరిగే అవకాశం ఉంది. దీంతో ఉద్యోగి భవిష్యనిధితో పాటు పెన్షన్ ప్రయోజనం కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

### దీర్ఘకాలంలో ఏం జరుగుతుంది?

పీఎఫ్‌లో ప్రతి నెల అదనంగా జమయ్యే మొత్తం చిన్నదిగా కనిపించొచ్చు. కానీ అది సంవత్సరాల పాటు ఖాతాలో కొనసాగుతుంది. దానిపై వచ్చే వడ్డీ కూడా మళ్లీ జమవుతుంది. దీంతో కాలం గడిచేకొద్దీ పొదుపు మొత్తం పెరుగుతుంది.
అందుకే కొత్త పీఎఫ్ పరిమితి వల్ల ఉద్యోగుల చేతికి వచ్చే జీతం కొంత తగ్గినా.. భవిష్యత్ పొదుపు పెరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఉద్యోగ జీవితంలో ఇంకా చాలా సంవత్సరాలు ఉన్నవారికి ఈ అదనపు పీఎఫ్ జమ దీర్ఘకాలంలో ఉపయోగపడొచ్చు.

# ప్రధాని మోదీ విజ్ఞప్తి ఫలిస్తుందా?

## బంగారం కొనుగోళ్లు తగ్గించాలని భారతీయులకు ప్రధాని మోదీ మరోసారి పిలుపు



**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 26 (ప్రజావినికిడి):**
అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయులకు మరోసారి విజ్ఞప్తి చేశారు. దేశ విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలను కాపాడుకునేందుకు ఈ చర్య దోహదపడుతుందని ఆయన సూచించారు. త్వరలో రానున్న ధన్‌తేరస్, దీపావళి వంటి కీలక పండగల నేపథ్యంలో ప్రధాని పిలుపునకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో, 2026 మే నెలలో మోదీ తొలిసారి ఈ విజ్ఞప్తి చేశారు. తాజాగా సెప్టెంబర్‌లోనూ ఆయన ఇదే విషయాన్ని గుర్తుచేశారు. భారత్ తన అవసరాలకు సంబంధించి అత్యధిక శాతం బంగారాన్ని దిగుమతుల ద్వారానే పొందుతోంది. 2026 రెండో త్రైమాసికంలో దేశీయ సరఫరాలో 82 శాతం దిగుమతుల నుంచే లభించింది. దీనివల్ల డాలర్ల రూపంలో చెల్లింపులు పెరిగి, సుమారు 780 నుంచి 785 బిలియన్ డాలర్లుగా ఉన్న ఫారెక్స్ నిల్వలపై ఒత్తిడి పెరుగుతోంది.ప్రధాని విజ్ఞప్తి ప్రభావం ఇప్పటికే కొంతమేర కనిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అనవసర కొనుగోళ్లు తగ్గినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా బంగారం అమ్మకాల పరిమాణం సుమారు 15 శాతం మేర తగ్గింది. వినియోగదారులు ఎక్కువగా తేలికపాటి ఆభరణాలను ఎంచుకోవడం లేదా పాత బంగారాన్ని మార్చుకోవడం వంటి పద్ధతులకు మొగ్గు చూపుతున్నారు.పండగల సమయంలో బంగారం కొనుగోలు చేయడం అనేది సంప్రదాయం, భావోద్వేగాలతో ముడిపడి ఉంటుందని గ్రోత్‌వైన్ క్యాపిటల్ నిపుణుడు శుభమ్ గుప్తా అభిప్రాయపడ్డారు. ఇప్పటికే తగినంత బంగారం ఉన్నవారు ఈసారి లాంఛనంగా కొద్ది మొత్తంలో కొనుగోలు చేయడం మేలని ఆయన సూచించారు. కేవలం పెట్టుబడి కోసమైతే, భౌతిక బంగారానికి బదులుగా గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ ఉత్తమ ప్రత్యామ్నాయాలని ఆయన వివరించారు. ఏదేమైనా, ప్రధాని పిలుపునకు అసలైన పరీక్ష రాబోయే పండగల సీజన్‌లోనే ఎదురుకానుంది.

# నాగాలాండ్‌లో కల్తీ మద్యం కలకలం.. రెండు రోజుల్లో 19 మంది మృతి



**సెప్టెంబర్ 26(ప్రజావినికిడి):**
నాగాలాండ్‌లో కల్తీ మద్యం అనుమానిత ఘటనలు కలకలం రేపుతున్నాయి. రెండు రోజుల్లో మద్యం సేవించిన తర్వాత 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మొకోక్‌చుంగ్ జిల్లాలో 8 మంది, ట్యూన్‌సాంగ్ జిల్లాలో 11 మంది మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.
ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ ఐ.బంగ్‌లాంగ్ చాంగ్ నేతృత్వంలో ఈ బృందం పనిచేయనుంది. అనుమానిత కల్తీ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? దాని సరఫరా వెనుక ఎవరున్నారు? అనే అంశాలను సిట్ దర్యాప్తు చేస్తోంది.మద్యం నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షల కోసం గువాహటికి పంపించారు. మరణాలకు అసలు కారణం ఏంటో పరీక్షల తర్వాత స్పష్టమవుతుందని పోలీసులు తెలిపారు. కొన్ని ఆధారాలు లభించాయని, అయితే దర్యాప్తు ప్రారంభ దశలో ఉన్నందున వివరాలు వెల్లడించలేమని సీనియర్ ఎస్పీ వెసుప్రా కెజో తెలిపారు.మరణాల నేపథ్యంలో పోలీసులు పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 19 మందిని అరెస్టు చేశారు. దాదాపు 3 వేల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.గుర్తుతెలియని, లేబుల్ లేని లేదా అనుమానిత అక్రమ మద్యాన్ని తాగవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. మద్యం తాగిన తర్వాత తల తిరగడం, చూపు మసకబారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని హెచ్చరించారు. నాగాలాండ్‌లో 1990 నుంచి మద్య నిషేధ చట్టం అమల్లో ఉంది.

# నకిలీ ఆధార్‌లకు చెక్..

## డూప్లికేట్ ఆధార్ల భరతం పట్టేందుకు దేశీయ టెక్నాలజీ

**నకిలీ ఆధార్ కార్డుల గుర్తింపునకు 'భారత్ ఏబీఐఎస్' అనే కొత్త వ్యవస్థ**

**యూఐడీఏఐ పరిశోధకుల ఆధ్వర్యంలో దేశీయంగా అభివృద్ధి**

**పరీక్షల్లో నిర్దేశిత లక్ష్యాలను మించి అత్యుత్తమ ఫలితాలు**

**భారత పూర్తి డేటాబేస్‌పై ఇంకా విస్తృత పరీక్షలు జరగాల్సి ఉందన్న నిపుణులు**




**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 26(ప్రజావినికిడి):**
దేశంలో ఆధార్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా భారత పరిశోధకులు కీలక ముందడుగు వేశారు. నకిలీ ఆధార్ కార్డులను అత్యంత కచ్చితత్వంతో గుర్తించేందుకు 'భారత్ ఏబీఐఎస్' (దీష్టుతీఫ్ ాాదీxూ) అనే సరికొత్త ఓపెన్ సోర్స్ బయోమెట్రిక్ వ్యవస్థను అభివృద్ధి చేశారు.
యూఐడీఏఐతో సంబంధం ఉన్న పరిశోధకులు, ఐఐటీ హైదరాబాద్, మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ నిపుణుల బృందం సంయుక్తంగా ఈ టెక్నాలజీని రూపొందించింది. ఇది దేశవ్యాప్తంగా ఆధార్ డేటాబేస్‌లో డూప్లికేట్ ఎంట్రీలను ఏరివేయడంలో కీలకంగా మారనుంది.'భారత్ ఏబీఐఎస్' అనేది వేలిముద్రలు, కనుపాప (ఐరిస్), ముఖ కవళికలను కలిపి బయోమెట్రిక్స్‌ను విశ్లేషించే ఒక మల్టీ-మోడల్ వ్యవస్థ. ఈ మూడు డేటాలను కలిపి ప్రతి వ్యక్తికి కేవలం 13.5 ఖదీ పరిమాణంలో ఒక టెంప్లేట్‌ను ఇది సృష్టిస్తుంది. దేశంలోని మొత్తం 155 కోట్ల ఆధార్ ఎంట్రీల నుంచి నమూనాగా సేకరించిన 22 కోట్ల డీ-ఐడెంటిఫైడ్ రికార్డులపై ఈ వ్యవస్థను పరీక్షించారు.ముఖ్యంగా 2 కోట్ల రికార్డుల సబ్‌సెట్‌పై జరిపిన పరీక్షల్లో ఇది అద్భుతమైన ఫలితాలను కనబరిచింది. తప్పుడు గుర్తింపుల రేటు (ఎఫ్‌పీఐఆర్) కేవలం 0.1 శాతంగా, అసలైన వాటిని గుర్తించడంలో వైఫల్యం రేటు (ఎఫ్ఎన్ఐఆర్) 0.05 శాతంగా నమోదైంది. ఈ ఫలితాలు యూఐడీఏఐ నిర్దేశించిన 0.5% ఎఫ్‌పీఐఆర్, 0.1% ఎఫ్ఎన్ఐఆర్ లక్ష్యాల కన్నా చాలా మెరుగ్గా ఉండటం గమనార్హం. ఎఫ్‌పీఐఆర్, ఈ వ్యవస్థ రూపకల్పనలో ఓపెన్ సోర్స్ భాగాలను వినియోగించడం వల్ల ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. డేటా ప్రాసెసింగ్, నాణ్యత అంచనా, ఫేక్ బయోమెట్రిక్స్‌ను గుర్తించడం వంటి పనుల కోసం ఓపెన్ సోర్స్ టూల్స్‌నే వాడారు. భారీ డేటాబేస్‌లో శోధన ప్రక్రియ వేగంగా జరిగేందుకు సర్వర్లపై పనిభారాన్ని సమానంగా పంపిణీ చేసే ఒక ప్రత్యేక షెడ్యూలర్‌ను కూడా ఇందులో పొందుపరిచారు.
వాణిజ్యపరంగా అందుబాటులో ఉన్న మూడు ప్రముఖ వ్యవస్థలతో పోల్చినప్పుడు 'భారత్ ఏబీఐఎస్' వాటికి సమానమైన లేదా అంతకంటే మెరుగైన కచ్చితత్వాన్ని చూపించింది. 8 ఎన్విడియా ఎ100 జీపీయూలు, 2 టీబీ ర్యామ్‌తో కూడిన ఒక్క సర్వర్‌పై 4 కోట్ల రికార్డుల గ్యాలరీలో సెకనుకు 100 శోధనలు చేయగల సామర్థ్యం దీనికి ఉంది.దేశంలో డూప్లికేట్ ఆధార్ కార్డులు ఇప్పటికీ ఒక సవాలుగానే ఉన్నాయి. 2022లో ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ దాదాపు 6 లక్షల నకిలీ ఆధార్ కార్డులను గుర్తించి రద్దు చేసినట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో 'భారత్ ఏబీఐఎస్' ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోని 'డీప్‌ప్రింట్' ఫింగర్‌ప్రింట్ మోడల్.. వృద్ధులు, చేతివేలిముద్రలు అరిగిపోయిన శ్రామికుల బయోమెట్రిక్ ప్రామాణీకరణ వైఫల్యాలను సగానికి తగ్గించగలదని పరిశోధకులు తెలిపారు. అయితే, ఈ వ్యవస్థ అద్భుతమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ, దేశంలోని పూర్తి ఆధార్ డేటాబేస్‌పై దీనిని ప్రయోగించడానికి ముందు మరిన్ని విస్తృత స్థాయి పరీక్షలు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో 2 కోట్ల లోపు జనాభా ఉన్న దేశాలకు ఇది తక్కువ ఖర్చుతో కూడిన సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా ఉపయోగపడగలదని వారు పేర్కొన్నారు.

# పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు మరింత సమయం ఇవ్వండి

## : లోక్‌సభ స్పీకర్ కు జితిన్ రామ్ మాంజీ లేఖ



**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 26(ప్రజావినికిడి):**
పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీల గళానికి మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కేంద్ర మంత్రి, ఎన్డీఏ మిత్రపక్ష నేత జితన్ రామ్ మాంజీ ఒక లేఖ రాశారు. పార్లమెంట్‌లో అత్యంత కీలకమైన బిల్లులపై చర్చ జరిగే తరుణంలో, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలకు సభలో మాట్లాడేందుకు మరికొంత అదనపు సమయం కేటాయించాలని ఆయన ఆ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఎన్డీఏ ఎంపీలతో నిర్వహించిన ఒక సమావేశంలో ఈ ప్రధానాంశం చర్చకు వచ్చినట్లు మాంజీ వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్ ఈ ప్రస్తావన తెచ్చారని తెలిపారు. తమ సామాజిక వర్గానికి చెందిన ప్రత్యేక సమస్యలు, అంశాలను సభలో వివరంగా ప్రస్తావించేందుకు ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు తగినంత సమయం అవసరమని పటేల్ కోరినట్లు మాంజీ తన లేఖలో ప్రస్తావించారు.ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్ చేసిన ఈ అభ్యర్థనను సీరియస్‌గా పరిగణించి, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు అవసరమైతే తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన స్పీకర్‌ను కోరారు. మరోవైపు, సభలో తమకు అసలు సమయమే కేటాయించడం లేదని తాము అనడం లేదని.. తమ వర్గాల సమస్యలపై మరింత లోతుగా చర్చించేందుకు కేటాయించిన సమయాన్ని మరింత పెంచాలని మాత్రమే కోరుతున్నట్లు ఎంపీ పటేల్ గతంలో ఒక మీడియాతో మాట్లాడుతూ స్పష్టం చేశారు.

# రూ.300 దర్శనం టికెట్లపై ఆ ప్రచారం నమ్మొద్దు.. భక్తులకు టీటీడీ విజ్ఞప్తి

**సెప్టెంబర్ 26(ప్రజావినికిడి):**
శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల ఆన్‌లైన్ బుకింగ్‌పై భక్తుల నుంచి వస్తున్న సందేహాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శనివారం సుదీర్ఘ వివరణ ఇచ్చింది. ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ సాంకేతికంగా అత్యంత పటిష్ఠంగా ఉందని, అయితే అందుబాటులో ఉన్న టికెట్ల కోటాకు మించి దాదాపు 9 రెట్లు అధికంగా డిమాండ్ ఉండటమే సమస్యకు ప్రధాన కారణమని స్పష్టం చేసింది. క్షణాల్లో టికెట్లు అయిపోవడాన్ని వ్యవస్థ వైఫల్యంగా భావించవద్దని భక్తులకు విజ్ఞప్తి చేసింది.

### గణాంకాలతో వాస్తవ పరిస్థితి వెల్లడి

టికెట్ల విడుదల సమయంలో వాస్తవంగా ఏం జరుగుతుందో టీటీడీ గణాంకాలతో సహా వివరించింది. దర్శన టికెట్ల బుకింగ్ కోసం ఒకేసారి సుమారు 6 లక్షల మంది యూజర్లు వెబ్‌సైట్‌లోకి వస్తున్నారని తెలిపింది. ఒక్కో యూజర్ సగటున తమ కుటుంబ సభ్యుల కోసం నాలుగు టికెట్లకు ప్రయత్నించినా, మొత్తం డిమాండ్ సుమారు 24 లక్షల టికెట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. అయితే, టీటీడీ విడుదల చేసే కోటా కేవలం 2.69 లక్షల టికెట్లు మాత్రమే. అంటే, అందుబాటులో ఉన్న ప్రతి టికెట్‌కు సగటున 9 మంది పోటీ పడుతున్నారని, ఈ తీవ్రమైన పోటీ కారణంగానే చాలా మందికి టికెట్లు లభించడం లేదని పేర్కొంది.




### వర్చువల్ క్యూ భద్రతకే, అడ్డంకి కాదు

బుకింగ్ సమయంలో భక్తులను కొంతసేపు నిరీక్షించేలా చేసే 'వర్చువల్ క్యూ' విధానంపై కూడా టీటీడీ స్పష్టత ఇచ్చింది. ఇది టికెట్లను నిరాకరించడానికి కాదని, ఒకేసారి లక్షలాది అభ్యర్థనలు వచ్చి సర్వర్లపై భారం పడకుండా, మొత్తం వ్యవస్థ స్థిరత్వాన్ని కాపాడేందుకు ఏర్పాటు చేసిన సాంకేతిక విధానమని తెలిపింది. గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్, ఆటో స్కేలింగ్, లోడ్ బ్యాలెన్సింగ్ వంటి ఆధునిక టెక్నాలజీతో ఆన్‌లైన్ వ్యవస్థను నిర్వహిస్తున్నామని, ప్రత్యేక టెక్నికల్ వార్-రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించింది.
అదేవిధంగా, పేమెంట్ విఫలమవడం పూర్తిగా టీటీడీ పరిధిలోని అంశం కాదని, ఇది పేమెంట్ గేట్‌వేలు, బ్యాంకులు, యూపీఐ నెట్‌వర్క్‌ల పనితీరుపై కూడా ఆధారపడి ఉంటుందని గుర్తుచేసింది. టికెట్లు అందుబాటులో లేకపోవడం వల్ల వచ్చే 'స్లాట్ అన్‌అవైలబుల్' సందేశాన్ని సాంకేతిక లోపంగా పరిగణించరాదని కోరింది. శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వంటి ఇతర ఆలయాల బుకింగ్ ప్రక్రియ ఇదే వ్యవస్థ ద్వారా సజావుగా సాగుతోందని, అక్కడ డిమాండ్ తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని ఉదహరించింది.
భక్తుల ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని, యాంటీ-బాట్ మెకానిజమ్స్, సెక్యూరిటీ, పేమెంట్ ప్రక్రియలను నిరంతరం మెరుగుపరుస్తున్నామని టీటీడీ హామీ ఇచ్చింది. భారీ డిమాండ్ ఉన్నప్పుడు ప్రతి ఒక్కరికీ టికెట్ లభించడం సాధ్యం కాదని, ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవాలని కోరింది. టీటీడీపై సోషల్ మీడియాలో జరిగే అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని, భక్తులకు పారదర్శకమైన, సురక్షితమైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఫ్లాపులు తట్టుకోలేక పరేషాన్ అవుతున్న బ్యూటీలు!







వెండితెరపై కథానాయిక అందంగా ఉండాలి .. ఆకర్షణీయంగా అనిపించాలి. దిష్టి చుక్క పెట్టని చందమామలా కనిపించాలి. లేదంటే ఆడియన్స్ నిరాశపడిపోతారు .. నిరుత్సాహానికి లోనవుతారు. తెరపై సమాజసేవలో అలసిపోయిన నాయకుడికి .. ఆ నాయకుడికి విజిల్స్ కొట్టి విసిగిపోయిన ఆడియన్స్ కి కాస్త ఉపశమనాన్ని కలిగించేది హీరోయిన్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటి హీరోయిన్ అందంగా ఉండాలని అనుకోవడంలోను తప్పులేదు.

అభిమానుల మనసు దోచుకుంటూ .. అవకాశాలను అందుకుంటూ .. విజయాలను సొంతం చేసుకోవడం అంత తేలికైన విషయమేం కాదు. ఇక్కడ హిట్టు తప్ప వాళ్లను కాపాడే మరో మంత్రమే లేదు. ఒకప్పుడు హీరోయిన్స్ ఏళ్లతరబడి ఏలుతూ వెళ్లారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారిపోయింది. ఎంత గ్లామరస్ గా ఉన్నప్పటికీ .. ఎంత టాలెంట్ ఉన్నప్పటికీ రెండు మూడు ఫ్లాపులు పడితే అంతే సంగతులు. మేకప్ కిట్ సర్దుకుని మరో ఇండస్ట్రీకి వెళ్లడం తప్ప మరో మార్గం లేదు.

కృతి శెట్టి ఇచ్చిన ఎంట్రీ మామూలుగా లేదు. ఫస్టు మూవీతోనే 100 కోట్ల బ్యూటీగా మార్కులు కొట్టేసింది. అరుదైన ఫీట్ గా చెప్పుకునే హ్యాట్రిక్ హిట్ ను దక్కించుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇక కుదురుకున్నట్టే అనుకునేంతలోనే పరాజయాల పలకరింపు మొదలైంది. అప్పటి నుంచి కృతి శెట్టి ఇక్కడ కనిపించలేదు. ఆ సమయంలో వరుస విజయాలతో చెలరేగిపోయిన శ్రీలీలకి కూడా ఆ తరువాత ఫ్లాపులు తప్పలేదు. ఆమె జోరు తగ్గడానికి కూడా ఎక్కువ సమయం పట్టలేదు.

ఈ నేపథ్యంలోనే విశాలమైన కళ్లతో విన్యాసాలు చేసుకుంటూ భాగ్యశ్రీ బోర్సే తెరపైకి వచ్చింది. అమ్మాయి గ్లామర్ కి వంకబెట్టవలసిన అవసరం లేదని ఆడియన్స్ అనుకున్నారు. కుర్రాళ్లంతా కూడబలుక్కుని ఆమె అభిమానుల జాబితాలో చేరిపోయారు. కానీ సక్సెస్ అనేక విధాలుగా ఆమెతో దోబూచులాడుతూనే వచ్చింది. దాంతో ఆమె కూడా ఇతర భాషా చిత్రాల వైపు అడుగులు వేయవలసి వచ్చింది. ఎంత అందంగా ఉన్నా .. టాలెంట్ ఉన్నా కొంత కాలం కూడా నిలదొక్కుకోలేక పోతుండటం నిజంగా విచారించదగిన విషయమే.

# విజయ్ కొడుకుపై ప్రశంసలు, 'కాకా'పై ధీమా!

## 'సిగ్మా' వేడుకలో చిరంజీవి..




సందీప్ కిషన్ కథానాయకుడిగా, దళపతి విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సిగ్మా' చిత్ర ప్రీ-రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేసి చిత్ర బృందానికి తన ఆశీస్సులు అందించారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, "'కాకా' సినిమా షూటింగ్ నుంచి నేరుగా ఇక్కడికే వచ్చాను. యువ ప్రతిభను ప్రోత్సహించడం నా బాధ్యతగా భావిస్తాను. సందీప్ కిషన్ నాకు కుటుంబ సభ్యుడి వంటి వాడు. 'ప్రస్థానం' నుంచి నేటి వరకు విభిన్న కథాంశాలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నాడు. అతడిని చూస్తుంటే నా కెరీర్ తొలి రోజులు గుర్తుకువస్తున్నాయి" అని పేర్కొన్నారు.దర్శకుడు జేసన్ సంజయ్‌పై చిరు ప్రశంసల వర్షం కురిపించారు. "జేసన్ తాతగారు ఎస్.ఎ. చంద్రశేఖర్ దర్శకత్వంలో నేను 'చట్టానికి కళ్లులేవు', 'దేవాంతకుడు' వంటి సూపర్ హిట్ చిత్రాలు చేశాను. ఇప్పుడు ఆయన మనవడితో వేదిక పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. జేసన్‌ను చూస్తుంటే 90వ దశకంలోని విజయ్ గుర్తుకువస్తున్నాడు. తన తండ్రిలాగే జేసన్ కూడా వృత్తిలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటాడని ఆకాంక్షిస్తున్నాను" అని చిరంజీవి అన్నారు.

'సిగ్మా' టైటిల్ గురించి ప్రస్తావిస్తూ "గూగుల్ చేస్తే ఎవరి మాటా వినని వాడు అని అర్థం వచ్చింది. ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమా ఫస్ట్ కాపీ నాకే చూపించాలి" అని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. హీరోయిన్ ఫరియా అబ్దుల్లాతో సరదాగా సంభాషించిన చిరంజీవి, సంగీత దర్శకుడు థమన్‌ను "రాముడికి హనుమంతుడి వంటి వాడు" అని కొనియాడారు. "'కాకా' రీ-రికార్డింగ్ పనులు అద్భుతంగా జరుగుతున్నాయి. ఈ సంక్రాంతి పక్కా మనదే" అంటూ తన చిత్రంపై ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# షూటింగ్‌కు ముందు 'దృశ్యం 3' నుంచి తప్పుకున్న అక్షయ్ ఖన్నా

## నటుడి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన దర్శకుడు అభిషేక్ పాఠక్



బాలీవుడ్ ప్రముఖ నటుడు అజయ్ దేవగణ్ కథానాయకుడిగా రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'దృశ్యం 3' సెట్స్‌పైకి వెళ్లే ముందే వివాదాల్లో చిక్కుకుంది. సినిమా షూటింగ్ ప్రారంభానికి కేవలం వారం రోజుల ముందు, కీలక పాత్ర కోసం ఎంపికైన నటుడు అక్షయ్ ఖన్నా ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు. ఈ అనూహ్య పరిణామంపై చిత్ర దర్శకుడు అభిషేక్ పాఠక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ ఉదంతంపై ఆయన స్పందిస్తూ, "ఒక నటుడు ఒప్పందంపై సంతకం చేసి, పారితోషికం అందుకున్న తర్వాత అర్ధాంతరంగా సినిమా నుంచి తప్పుకోవడం సరైన పద్ధతి కాదు. వారి బాధ్యతారాహిత్యం వల్ల నిర్మాతలు తీవ్ర ఒత్తిడికి గురవుతారు. రోజుకు రూ. 2,000 నుంచి రూ. 3,000 సంపాదించే ఎంతో మంది సినీ కార్మికుల జీవనోపాధిపై ఇది ప్రభావం చూపుతుంది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ముందే చర్చించి పరిష్కరించుకోవాలి" అని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే నటులను కట్టడి చేసేందుకు చిత్ర పరిశ్రమలో కఠినమైన చట్టాలు, నిబంధనలు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.కాగా, ఈ వ్యవహారంలో చిత్ర నిర్మాత, అభిషేక్ తండ్రి కుమార్ మంగత్ పాఠక్ ఇప్పటికే అక్షయ్ ఖన్నాకు లీగల్ నోటీసులు పంపారు. అక్షయ్ తప్పుకోవడంతో, ఆయన పోషించాల్సిన ఐజీ తరుణ్ అహ్లావత్ పాత్రను చిత్ర బృందం పూర్తిగా మార్చివేసింది. ఆ స్థానంలో ఎస్పీ రాజ్‌వీర్ సింగ్ తోమర్ అనే మరో శక్తిమంతమైన పాత్రను సృష్టించి, ఆ పాత్ర కోసం నటుడు జైదీప్ అహ్లావత్‌ను ఎంపిక చేశారు. 'దృశ్యం' ఫ్రాంచైజీలో చివరి భాగంగా రానున్న ఈ చిత్రంలో అజయ్ దేవగణ్, శ్రియ, టబు, ఇషితా దత్తా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను 2026 అక్టోబర్ 2న విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.

# 'జైలర్ 2' .. వెయ్యికోట్ల మాట!



రజనీకాంత్ కి ఉన్న క్రేజ్ గురించి .. ఆయన సినిమాలకి గల మార్కెట్ ను గురించిగాని ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. ఒకానొక సందర్భంలో సీనియర్ దర్శకులతో మాత్రమే సినిమాలు చేస్తూ వెళ్లిన రజనీకాంత్, ఆ తరువాత యువ దర్శకులతో సినిమాలు చేయడానికి ఉత్సాహాన్ని చూపుతూ వెళ్లారు. అందుకు నిదర్శనంగా తెరపైకి వచ్చిన సినిమాలే 'కబాలి' .. 'కాలా' .. 'జైలర్'. అప్పటివరకూ తెరపై కనిపిస్తూ వచ్చిన రజనీని లుక్ పరంగా కొత్తగా ఆవిష్కరించిన సినిమాలు ఇవి.రజనీకాంత్ కెరియర్ లో సూపర్ హిట్లు .. బ్లాక్ బస్టర్ సినిమాలు చాలా ఉండొచ్చు. అయితే ఆ జాబితాలో ప్రత్యేకంగా కనిపించే సినిమాగా 'జైలర్' ను గురించి చెప్పుకోవచ్చు. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, 600 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. చాలా వేగంగా ఈ మార్కును అందుకున్న సినిమాగా ఇది నిలిచిపోయింది. రజనీ ఛరిష్మా ఎంతమాత్రం తగ్గలేదని నిరూపించిన సినిమా ఇది. అలాంటి ఈ సినిమాకి ఇప్పుడు సీక్వెల్ రెడీ అవుతోంది. దసరా కానుకగా అక్టోబర్ 15వ తేదీన ఈ సినిమాను భారీస్థాయిలో విడుదల చేయనున్నారు. 300 కోట్లకి పైగా బడ్జెట్ తో నిర్మితమవుతున్న ఈ సినిమా, వెయ్యికోట్లకి పైగా వసూళ్లను రాబట్టడం ఖాయమనే మాట చాలా బలంగా వినిపిస్తోంది. మిథున్ చక్రవర్తి .. ఎస్ జె సూర్య .. విద్యాబాలన్ .. రమ్యకృష్ణ వంటి స్టార్స్ ఈ సినిమాలో కీలకమైన పాత్రలలో కనిపించనున్నారు. అనిరుధ్ నేపథ్య సంగీతం ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్ కి తీసుకువెళుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దసరాకి ఈ సినిమా ఏ రేంజ్ లో సందడి చేస్తుందనేది చూడాలి మరి.



కాజల్ అగర్వాల్

# క్యారెక్టర్ లేని వాళ్లను దూరంగానే ఉంచాలి!

మానవ సంబంధాలలో నమ్మకం, ఆత్మగౌరవం అత్యంత కీలకమైనవని.. క్యారెక్టర్ (ప్రవర్తనా శైలి) సరిగ్గా లేని వారిని, స్వార్థపరులను ఎల్లప్పుడూ దూరంగానే ఉంచాలని నటి కాజల్ అగర్వాల్ అభిప్రాయప్డారు. చిత్ర పరిశ్రమలో దశాబ్దానికి పైగా అగ్ర కథానాయికగా వెలిగిన అమ్మడు వ్యక్తిగత జీవితంలోనూ పరిణతి సాధించిన కాజల్ సంబంధాలు , మానసిక ప్రశాంతతపై చేసిన వ్యాఖ్యలు ఆకట్టుకుంటున్నాయి. ప్రేమ, స్నేహం, కుటుంబం లేదా ఉద్యోగం చేసే చోట.. ఎక్కడైనా సరే నమ్మకద్రోహానికి ఒడిగట్టే వ్యక్తులకు జీవితంలో స్థానం ఉండకూడదని పునరుద్ఘాటించారు. బంధాలన్నింటికీ పునాది నమ్మకమేనని, ఆ నమ్మకం ఒకసారి ఒమ్మయితే మళ్లీ పూర్వస్థితికి తీసుకురావడం అసాధ్యమని కాజల్ అభిప్రాయపడ్డారు. మన ప్రాణ స్నేహితులైనా? ప్రేమించిన వారైనా లేదా పని చేసే చోట సహచరులైనా సరే.. స్వార్ధ పూరిత ఆలోచనలతో నమ్మకాన్ని తుంగలో తొక్కే వారితో కలిసి ప్రయాణించడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. పైకి నవ్వుతూ లోపల స్వార్థాన్ని దాచుకునే వ్యక్తులను గుర్తించి, వారికి తగిన దూరంలో ఉండటమే శ్రీరామరక్ష అన్నారు.కవలం తమ స్వార్థం, అవసరాల కోసమే సంబంధాలను వాడుకునే మానసిక తత్వం ఉన్నవారు ప్రతి రంగంలోనూ ఉంటారని కాజల్ వ్యాఖ్యానించారు. అలాంటి వారు మన బలహీనతలను ఆసరాగా చేసుకుని, అవసరం తీరాక వెన్నుపోటు పొడవడానికి కూడా వెనుకాడరని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఎవరినైనా మన జీవితంలోకి లేదా వ్యక్తిగత పరిధిలోకి ఆహ్వానించే ముందు వారి క్యారెక్టర్, ఆలోచనా ధోరణిని గమనించడం ఎంతో అవసరమని ఆమె సూచించారు. ముఖ్యంగా పని చేసే ప్రదేశాల్లో వృత్తిపరమైన సరిహద్దులు కాపాడుకోవడం ముఖ్యమని కాజల్ పేర్కొన్నారు. పని చేసే చోట అసూయ, స్వార్థం, వెన్నుపోటు పొడిచే మనస్తత్వాలు ఉన్నవారిని ఎంత దూరంగా ఉంచితే కెరీర్‌కు, మానసిక ఆరోగ్యానికి అంత మంచిదన్నారు. విషపూరితమైన వాతావరణం లేదా వ్యక్తుల నుంచి వెంటనే బయటకు రావడం లేదా వారిని దూరంగా పెట్టడం ద్వారా మాత్రమే పనిపై సరిగ్గా దృష్టి పెట్టగలమని అభిప్రాయపడ్డారుసినీ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసిన కాజల్ అగర్వాల్, వివాహం తర్వాత తల్లిగా మారాక జీవితం పట్ల దృక్పథం మరింత స్పష్టంగా మారిందని తెలిపారు. అనుభవంతో వచ్చే పరిణతి వల్ల జీవితంలో ఎవరికి ఎంతవరకు స్థానం ఇవ్వాలో అర్థమవుతుందన్నారు. ఆత్మగౌరవంతో బతకడం, అనవసరమైన డ్రామాలకు చోటు ఇవ్వకుండా ప్రశాంతంగా జీవించడమే మొదటి ప్రాధాన్యమని, ప్రతి ఒక్కరూ జీవితంలో ఈ సూత్రాన్ని పాటించాలని కోరారు. రూపానికో? హోదాకో? విలువ ఇవ్వడం కంటే వ్యక్తిత్వానికి ప్రాధాన్యత ఇవ్వడమే నిజమైన వివేకమని కాజల్ వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613